




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

అనుక్షణం
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 04 మంగళవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 168
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బోణి

- కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపు
- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయు అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి
- ఆదిలాబాద్,నిజామాబాద్,కరీంనగర్,మెదక్ గ్రాడ్యుయేట్ ఫలితాలు నేడు
- భారతీయ జనతా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

2


శ్రీపాల్ రెడ్డి | మల్క కొమురయ్య

**కరీంనగర్-నవభూమిబ్యూరో:** తెలంగాణలోని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధించారు. ఇక నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయాన్ని అందుకొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఈ గెలుపు ఆయన సొంతమైంది. అలాగే వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. మార్చి 27వ తేదీన తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీలకు ఎన్నికలు జరిగాయి.
వాటికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ మార్చి 3వ తేదీ ఉదయం ప్రారంభమైంది. వాటిలో ఒకటి వరంగల్, ఖమ్మం, నల్గొండకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఇక 2 ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అదే విధంగా.. ఆదిలాబాద్, నిజామా బాద్, కరీంనగర్, మెదక్ గ్రాడ్యుయేట్ స్థానానికి సంబంధించిన ఎమ్మెల్సీ కౌంటింగ్ ఈ రోజు జరుగుతోంది.
వీటిలో 2 స్థానాల ఫలితాలు తేలిపోయాయి. వాటి విజేతలు ఎవరో స్పష్టత వచ్చేసింది. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే కౌంటింగ్ సైతం కొనసాగుతోంది. అందులో

## ఉత్తరాంధ్ర టీచర్స్ పోరులో పీఆర్టీయు అభ్యర్థి గెలుపు



- ముచ్చటగా మూడోసారి టీచర్స్ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు
- ఉత్తరాంధ్ర టీచర్స్ పోరులో కూటమికి షాక్?
- 2 గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ముందంజ

2



**విజయవాడ-నవభూమిబ్యూరో**
ఏపీలో తాజాగా రెండు గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు మరో టీచర్స్ కోటా ఎమ్మెల్సీ ఎన్నిక కూడా జరిగింది. ఇందులో కృష్ణా-గుంటూరు, గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం కూడా ఉంది. ఈ మూడు సీట్లకు ఇవాళ ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఇందులో తక్కువ ఓట్లు ఉన్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానం ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగుతోంది. ఇందులో కూటమికి తొలి రౌండ్‌లో ఎదురు దెబ్బ తగిలింది. ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్టీయూ అభ్యర్థిగా గాదె శ్రీనివాసులు నాయుడు, కూటమి బలపరిచిన ఏపీటీఎఫ్ అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మ, పీడీఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి పోటీ చేశారు. ఈ ముగ్గురి మధ్య జరిగిన త్రిముఖ పోటీలో గాదె శ్రీనివాసులు నాయుడు ముందున్నారు. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో ఎవరికీ గెలిచేంత ఆధిక్యం రానప్పటికీ శ్రీనివాసులు నాయుడు మాత్రం తన సమీప ప్రత్యర్థి, కూటమి అభ్యర్థి

## కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్రానికి అన్యాయం



- ఏపీ ప్రభుత్వంపై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు
- కృష్ణా బేసిన్ నుంచి ఏపీ అధిక నీటిని తీసుకుంటోంది
- ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలని కేంద్రమంత్రికి ఫిర్యాదు
- తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలి
- ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్‌తో సీఎం చర్చలు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక నీటిని తీసుకుంటోం దని ఆయన విమర్శించారు. నీటి తరలింపును అడ్డుకోవాలని తాము కేంద్రాన్ని కోరామని స్పష్టం చేశారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలతోపాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల కేటాయింపు, వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సంఘటనను సైతం మంత్రికి వీరు సోదాహరణగా వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కార్యాలయం వెలుపల సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లా డుతూ.. ఆంధ్రప్రదేశ్ చేపడుతోన్న బనకచర్లపై తమ అభ్యంతరాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజేశామన్నారు. అయితే ఏపీ నుంచి ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమకు ఎలాంటి డీపీఆర్ రాలేదని మంత్రి వివ రించారని చెప్పారని తెలిపారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క - సారక్క ప్రాజెక్టులకు.. త్వరగా నీటి కేటాయింపులు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరించారు. ఇక తమ ప్రాజెక్టులకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) క్లియరెన్స్ ఇంకా రాలేదని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో నిర్మా ణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరామని చెప్పారు.
గోదావరి జలాలను అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు ఇంత వరకు జరగలేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తమ ప్రాజెకు లకు ఎందుకు అభ్యంతరం చెబుతోందంటూ ఏపీపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ ప్రాజెక్టులకు, శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే నికర జలాలు ఉన్నాయనేది లెక్క తేలుతుందని ఆయన వివరించారు.

## మూడు రాజధానులపై వైసీపీ యూటర్న్?

- 3 రాజధానులపై మాట మార్చిన వైసీపీ..
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి 3 రాజధానులే కారణమని భావిస్తున్న వైసీపీ
- అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకున్నామన్న వైసీపీ ఎమ్మెల్సీ బొత్స
- ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా త్వరలో నిర్ణయం..బొత్స వెల్లడి



2

**అమరావతి-నవభూమిబ్యూరో**
వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో అధికారంలో ఉన్న గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో అతి కీలకమైనది- 3 రాజధానులు. అమరావతిని శాసన రాజధానిగా కొనసాగిస్తూనే.. విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక, కర్నూలును న్యాయ రాజధానిగా బదలాయించాలని గతంలో భావించింది గానీ అది సాధ్యపడలేదు. వాస్తవ రూపాన్ని దాల్చలేదు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ ఘోరంగా ఓటమిపాలు కావడానికి- మూడు రాజధానుల విధానం కూడా ఓ కారణమంటూ అప్పట్లో వార్తలొచ్చిన విషయం తెలిసిందే. రాజధానులు చేయాలనుకున్న జిల్లాల్లో ఒక్క కర్నూలు మినహా మరెక్కడా కనీసం ఖాతా కూడా తెరవలేకపోయిందా పార్టీ. సీనియర్లు సైతం పరాజయాన్ని చవిచూశారు. ఈ ఓటమి నేపథ్యంలో మూడు రాజధానుల విధానాన్ని వైఎస్ఆర్సీపీ పునఃసమీక్షించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. దీనిపై తాజాగా మాజీ మంత్రి, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడారు. ఇదే విధానాన్ని కొనసాగించడంపై ప్రతికూల వ్యాఖ్యలు

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్


- 10 వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం
- 20న పోలింగ్..అదేరోజు సాయంత్రం కౌంటింగ్
- నోటిఫికేషన్ తర్వాత అమల్లోకి ఎన్నికలకోడ్
- అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు,పవన్ కసరత్తు
- పవన్‌కళ్యాణ్ సోదరుడు,నాగబాబు,వర్మకు ఛాన్స్?




**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలయింది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం ఉంటుంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహిస్తారు. యనమల రామ కృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్ బాబుల ఎమ్మెల్సీ పదవీకాలం ఈ నెల 29తో ముగి యనుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి తరఫున డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు, పవన్ కోసం పిఠాపురం ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన టీడీపీ నేత వర్మకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. మిగిలిన మూడు సీట్లను వివిధ సామాజికవర్గాలకు ఇచ్చే అవకాశం ఉంది. సంఖ్యాబలం లేని వైసీపీకి ఒక్క ఎమ్మెల్సీ స్థానం కూడా దక్కే అవకాశం లేదు.

## 8 మందిని సురక్షితంగా తీసుకురావాలి

- టన్నెల్ ప్రమాదంపై తెలంగాణ హైకోర్టులో పిల్
- నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ పిల్
- పది రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ లేదని వెల్లడి
- ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ సొరం గంలో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా తీసుకురావాలంటూ నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ పిల్‌ను దాఖలు చేసింది. ప్రమాదం జరిగి పది రోజులవుతున్నప్పటికీ కార్మికుల ఆచూకీ లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. టన్నెల్ సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొంటున్నట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 24 గంటలు సహాయక చర్యలు కొనసాగుతున్నా యని వెల్లడించారు. సహాయక చర్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని కోర్టుకు తెలిపారు. అడ్వొకేట్ జనరల్ తెలిపిన వివరాలను నమోదు చేసిన హైకోర్టు పిల్‌పై విచారణను ముగించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోల మృతి
- మరికొంత మందికి తీవ్రంగా గాయాలు
- ధామ్‌తారి జిల్లాలో మాదగిరి అడవుల్లో కొనసాగుతోన్న కూంబింగ్



**రాయ్‌పూర్-నవభూమిబ్యూరో:** ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ధామ్‌తారి జిల్లాలో ఖల్లారి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదగిరి అడువుల్లో సోమవారం ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా.. మరికొంత మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. అయితే ఈ ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోన్నట్లు తెలుస్తోంది. సదరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారంటూ భద్రత దళాలకు సమాచారం అందిందింది. ఈ సమావేశంలో భారీగా మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలియడంతో.. భద్రత సిబ్బంది సదరు అటవీ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ నిర్వహించారు. ఈ విషయాన్ని పసిగట్టిన మావోయిస్టులు వెంటనే స్పందించి.. భద్రతా దళాలపైకి కాల్పులకు తెగబడ్డాయి. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి.. ఎదురు కాల్పులకు దిగారు. ఈ నేపథ్యంలో ఇరు వైపులా హోరాహోరీ కాల్పులు చోటు చేసుకున్నాయి. ఆ క్రమంలో పలువురు మావోయిస్టులు మృతి చెందారు.

## మెగా డీఎస్సీకి త్వరలో నోటిఫికేషన్

- ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి లోకేశ్ వెల్లడి
- డీఎస్సీపై సభ్యుల పలు ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం
- 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు
- రూ.3వేల కోట్లు ఖర్చుతో స్కూళ్ల ప్రహారీగోడల నిర్మాణం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని చెప్పారు. "రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ల ప్రహరీ గోడలను పూర్తిచేయాలంటే రూ. 3వేల కోట్లు ఖర్చు అవుతుంది. మన బడి-మన భవిష్యత్తు.. నినాదంతో ఉపాధి హామీ కింద దశల వారీగా వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. 'డ్రగ్స్ వద్దు బ్రో'.. అనే క్యాంపెయిన్ను ఈ ప్రభుత్వం చేపట్టింది. ప్రతి పాఠశాల, కాలేజీల్లో 'ఈగల్ బృందాలను ఏర్పాటప చేస్తున్నాం. పేరెంట్-టీచర్ మీటింగ్లో ఇచ్చిన స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు వేస్తున్నాం.
గత ప్రభుత్వం హయాంలో 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారు. దీంతో 12 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. దీనికి ఓ ప్రత్యామ్నాయంపై

## గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

- గల్ఫ్ అమరుల సంస్మరణ సభకు కాంగ్రెస్ సర్కారు సన్నాహాలు
- గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- 113 బాధిత కుటుంబాలకు వెంటనే నిధులు విడుదలకు సీఎం ఆదేశం
- రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి వెల్లడి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్కార్.. బతుకుదెరువు కోసం ఎడారి దేశాలకు వెళ్లి అనుకోని పరిస్థితుల్లో అక్కడే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల పరిహారం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. నిధుల విడుదలకు సైతం సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల ఆధారంగా జాబితా సిద్ధం చేసిన అధికారులు.. 113 బాధిత కుటుంబాలు న్నట్టు తెలిపారు. దీంతో.. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున.. 113 బాధిత కుటుంబాలకు వెంటనే నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ

## ఉత్తర,దక్షిణ కరోలినాలలో కార్చిచ్చు!

- అమెరికాలో మళ్లీ కార్చిచ్చు..
- వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- 1.9 చ.కి. అటవీభూమి దగ్ధం
- 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని, ప్రాణనష్టం సంభవించలేదన్న అధికారులు




**న్యూయార్క్-నవభూమిబ్యూరో**
అమెరికాలోని ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో కార్చిచ్చు వ్యాపించింది. ఇప్పటికే వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది. దానిని అర్పేందుకు తీవ్ర స్థాయిలో యత్నిస్తున్నారు. దక్షిణ కరోలినా రాష్ట్ర అటవీ సంరక్షణ విభాగం. ప్రకారం.. ఇప్పటికే 1.9 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ భూమి దగ్ధమైపోయింది. ఇప్పటి వరకు ఈ కార్చిచ్చులో ఎవరు గాయపడినట్లు, ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం లేదు.
సౌత్ కరోలినాలో అత్యవసర పరిస్థితి విధిస్తున్న ట్లు రాష్ట్ర గవర్నర్ హెన్రీ మెక్ మాస్టర్ ప్రకటిం చారు. ఇక పరిస్థితిని అదుపు చేసేందు కు అగ్నిమాపక సిబ్బంది యత్నిస్తునట్లు వెల్లడిం చారు. మొత్తం 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని వెల్లడించారు.నార్త్ కరోలినాలో 4 వేర్వేరు ఆటవీప్రాంతాల్లో రేగిన కార్చిచ్చుతో 161 హెక్టార్లు దగ్ధమయ్యాయి. వీటిల్లో ఉవారీ నేషనల్ ఫారెస్ట్లో చెలరేగిన మంటలు అతిపెద్దవని అధికారులు. చెబుతు న్నారు.

**జపాన్లో 30 ఏళ్లలో అతిపెద్ద కార్చిచ్చు...**
జపాన్లో గత 30 ఏళ్లలో ఎన్నడూ చూడనంత అతిపెద్ద కార్చిచ్చు వ్యాపించింది. దీంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటి వరకు 4,500 ఎకరాల్లో అటవీ సంపద కాలి

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.. తొలి విడత ఆర్థిక సాయం రూ.లక్ష.. ఆ రోజే అకౌంట్లోకి జమ..



**హైదరాబాద్-నవభూమి:**ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కల నెర వేరనుంది. ఇంటి నిర్మాణంలో భాగంగా విడతల వారీగా డబ్బులను అకౌంట్లోకి జమ చేయనుండగా.. మొదటి విడత కింద రూ.లక్ష ఎప్పుడు జమ చేసే విషయంపై క్లారిటీ వచ్చింది. దీనికి సంబంధించి నిధులను కూడా ప్రభుత్వం సమకూర్చింది. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచి పోయిన ఈ ప్రక్రియ వేగవంతం కానుంది. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలనేది రేవంత్ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగానే ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇంటి పథకానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. అర్హులైన వారి నుంచి ప్రజాపాలన, గ్రామసభల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. జనవరి 26వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. జిల్లాల వారీగా అర్హుల జాబితాను కూడా ప్రకటించింది. తొలి విడతగా ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యతను ఇవ్వనుంది. తెలంగాణలో ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ కోడ్ అమలు అయ్యే నాటికి ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న వారు దాదా 71,480 మంది ఉన్నారు. వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వీటిలో 700 మంది ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. వీరికి ఆయా గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో పరిశీలన పూర్తయింది. ఇళ్ల నిర్మాణాలకు జియో ఫెన్సింగ్ కూడా పూర్తి చేశారు. గ్రామ కార్యదర్శుల యాప్‌లో ఆ ప్రాంతంలో ముగ్గు పోసుకున్న ఫొటోలు, అక్షాంశ రేఖాంశాల ఆధారంగా ఆ లబ్ధిదారుల వివరాలను యాప్ లో పొందుపరిచారు.పై అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు కూడా అదే ప్రదేశంలో ఇళ్ల నిర్మాణం ఉండాలని కార్యదర్శులు వారికి సూచించారు.

## వీడు కొడుకు కాదు సైకో.. కన్నతల్లి అని కూడా చూడకుండా అత్యంత కర్కషంగా.. దారుణం..!



**సంగారెడ్డి-నవభూమి:** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఒళ్లుగగుర్పొడిచే దారుణం వెలుగు చూసింది. నవమాసాలు మోసి ప్రాణాన్ని పణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తే.. ఆ బిడ్డే 26 ఏళ్ల తర్వాత ఆ తల్లికి మరణ శాసనం రాశాడు. పున్నామ నరకం నుంచి తప్పించాల్సిన ఆ కొడుకు.. అత్యంత నరకప్రాయమైన మరణాన్ని ఆ తల్లికి ఇచ్చాడు. ఈ ఘటన.. సమాజంలో పెరిగిపోతున్న సైకోయిజానికి అద్దంపడుతోంది. మరి.. తల్లిని ఆ కొడుకు ఎందుకు అంత కర్కషంగా హతమార్చాడంటే..?సమాజంలో మనుషుల మధ్య ఉండే సంబంధాలకు రోజురోజుకు విలువ తగ్గిపోతోంది. నవమాసాలు మోసి.. ప్రాణాన్ని పణంగా పెట్టి జన్మనిచ్చిన తల్లినే ఏమాత్రం కనికరం లేకుండా కర్కశంగా కత్తితో పొడిచి చంపిన ఈ కసాయి కొడుకు ఘటన.. ఒళ్లంతా రక్తం పూసుకుంటూ నేరపూరితంగా మారిపోతున్న సమాజానికి అద్దం పడుతోంది.సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డివినో విల్లాస్‌లో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 26 ఏళ్ల క్రితం కార్తీక్ రెడ్డికి జన్మనిచ్చింది రాధిక. కానీ.. అప్పుడు ఆమెకు తెలియదు కదా.. ఆమె గర్భంలో పెరిగిన ఆ నలుసే.. 26 ఏళ్ల తర్వాత ఆమెకు మరణ శాసనం రాస్తాడని. అందరిలాగే అల్లారుముద్దుగా పెంచుకుంది. ఏ తల్లైనా బిడ్డను కంటుంది కానీ.. ఆ బిడ్డ బుద్ధిని కనలేదు కదా. ఇప్పుడు రాధికకు 52 ఏళ్లు. తనకు పుట్టిన బిడ్డ పెద్దయ్యాక ప్రయోజకుడవుతాడని కలలు కంటూ అడిగినదల్లా కొనిస్తూ లగ్జరీగా పెంచితే.. ఆ తల్లిదండ్రులు కన్న కలలకు భిన్నంగా మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసై సైకో కొడుకుగా తయారయ్యాడు.

అప్పులు చేశాడో, ఆశలకు పోయాడో తెలియదు కానీ.. ఆస్తి పంచివ్వాలని గొడవ మొదలెట్టాడు. ఎన్ని రోజులున్నా ఉన్న ఆస్తి మొత్తం కొడుకే కదా. కానీ.. ఆ కొడుకు ఉన్న పరిస్థితిలో పంచిస్తే మరింత విచ్చలవిడిగా తయారవుతాడని భావించిన తల్లిదండ్రులు కార్తీక్ మాటలను నిరాకరిస్తూ వస్తున్నారు. ఎంత చెప్పినా వినకుండా.. తను కోరుకున్నంత ఆస్తి తనకు కావాలని రోజూ రచ్చ చేస్తున్నాడు కార్తీక్.ఎంత గొడవ చేసినా.. ఆస్తి పంచివ్వకపోయేసరికి తల్లిదండ్రులను శత్రువులుగా చూడడం మొదలుపెట్టాడు. చిన్నప్పుడు తల్లిదండ్రులు పంచిన ప్రేమను పూర్తిగా మర్చిపోయాడు. ఆస్తి ఒక్కటే అతడి టార్గెట్. ఏం చేస్తే ఆస్తి తన సొంతమవుతుందని ఆలోచించి.. చివరికి ఓ ప్లాన్ వేశాడు. 2న బ్రహ్మముహూర్తంలో తల్లిని చంపేయ్యాలని స్కెచ్ వేశాడు. తల్లితో మళ్లీ ఆస్తి కోసం గొడవ మొదలెట్టాడు. తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో పదునైన కత్తితో.. తల్లిని కర్కషంగా 8 సార్లు పొడిచాడు. రాధిక అరుపులు విన్న ఇరుగుపొరుగు వాళ్లు.. రక్తపు మడుగులో ఉన్న ఆమెను హుటాహుటిన దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే రాధిక ప్రాణాలు విడిచింది.నిందితుడు కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

## వివాహిత అనుమానాస్పద మృతి.. శరీరంపై గాయాలు, అతడే కారణమా..?



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ మలక్‌పేటలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. గుండెపోటు కారణంగానే ఆమె మృతి చెందిందని భర్త.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అత్తమామలు, మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరకముందే మృతదేహాన్ని సొంత గ్రామం తరలించేందుకు ప్రయత్నించాడు. అనుమానం వ్యక్తం చేసిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే.. శ్రీశైలం సమీపంలోని దోమలపెంటకు చెందిన సింగం శిరీష, వినయ్ కుమార్ దంపతులు. మలక్‌పేట్ జమునా టవర్స్‌లో గత కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. వినయ్ వ్యాపారి కాగా.. శిరీష గృహిణి. అయితే, నేడు ఉదయం శిరీష గుండెపోటుతో మృతి చెందిందని భర్త వినయ్ కుమార్ ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఏం జరిగిందో అర్థం కాక.. ఆవేదనతో శిరీష తల్లిందండ్రులు, బంధువులు హైదరాబాద్ బయల్దేరారు. అయితే వారు నగరానికి చేరకముందే భర్త వినయ్ శిరీష మృతదేహాన్ని ఆమె స్వగ్రామం దోమలపెంటకు తరలించే ప్రయత్నం చేశాడు.అనుమానం వ్యక్తం చేసిన శిరీష తల్లిదండ్రులు.. ఆమె ఒంటిపై కొట్టిన గాయాలను గుర్తించారు. అల్లుడే తమ కూతుర్ని కొట్టి చంపి ఉంటాడని భావించారు. మతదేహంపై స్పష్టమైన గాయాలు ఉంటే.. గుండెపోటుగా చిత్రీకరించారంటూ మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు అపార్ట్‌మెంట్, హాస్పిటల్ సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శిరీష మృతికి భర్తే కారణంగా బంధువులు ఆరోపిస్తున్నారు. విచారణలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

## పోసానికి 13 వరకూ రిమాండ్

**అనంతపురం-నవభూమి:** సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై విచారణ పరంపర కొనసాగుతోంది. ఆయన్ను అదుపులోకి తీసుకోవడానికి ఏపీలోని పలు జిల్లాల పోలీసులు క్యూ కడుతున్నారు. పోసానిపై నరసరావుపేటతో పాటు, బాపట్ల, అనంతపురం రూరల్, యాదగిరి, పుత్తూరు, విజయవాడ, పాలకొండ, పాతపట్నం తదితర ప్రాంతాల్లో పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. అనంతపురం రూరల్ పోలీసులు కూడా సోమవారం పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఆయన్ని అదుపులోకి తీసుకునేందుకు అల్లూరి జిల్లా పోలీసులు కూడా పీటీ వారెంట్ కోసం కోర్టు అనుమతి కోరారు. కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టులో ఆయన్ని హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలు నుంచి పీటీ వారెంట్‌పై సోమవారం తరలించారు.

## సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మక ముందడుగు..
# రాజస్థాన్‌తో రేవంత్ సర్కార్ భారీ ఒప్పందం



**హైదరాబాద్-నవభూమి:**దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలపాలన్న లక్ష్యంతో.. రేవంత్ రెడ్డి సర్కార్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా.. ఇప్పటికే పలు విదేశీ కంపెనీల నుంచి భారీ స్థాయిలో పెట్టుబడులు రాబట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ప్రతిష్టాత్మక ఒప్పందాలు కూడా చేసుకుంటోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వ చొరవతో.. సింగరేణి సంస్థ.. తన వ్యాపార విస్తరణలో ప్రతిష్టాత్మక ముందడుగు వేసింది. సోమవారం (మార్చి 02వ తేదీన) రోజు రాజస్థాన్ ప్రభుత్వంతో సింగరేణి సంస్థ భారీ ఒప్పందం కుదుర్చుకోనుంది. రాజస్థాన్ విద్యుత్ శాఖతో 3100 మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టులపై సింగరేణి చారిత్రాత్మక ఒప్పందం చేసుకుంది. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సమక్షంలో ఎంఓయూ చేసుకోనున్నారు. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రెడ్డి, ఎనర్జీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్. బలరాం, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ రాజస్థాన్ చేరుకున్నారు. ఈ రోజు (మార్చి 03న) మధ్యాహ్నం రాజస్థాన్‌లో ఎంఓయూ చేసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

రాజస్థాన్ విద్యుత్ శాఖ అనుబంధ సంస్థతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేయబోతుంది. జాయింట్ వెంచర్ కంపెనీతో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్, రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనకు ఒప్పందం కుదుర్చుకోకున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ ఒప్పందం.. సింగరేణి ఆర్థిక పరిపుష్టికి అతిపెద్ద అవకాశమని తెలిపారు. మొత్తం వ్యయంతో పాటు లాభాల్లో సింగరేణి సంస్థ 74 శాతం, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్‌కు 26 శాతం వాటా ఉంటుంది. తొలిసారిగా ఇతర రాష్ట్రాల్లో అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో జాతీయ స్థాయి కంపెనీగా సింగరేణికి గుర్తింపు పొందుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

ఇదిలా ఉంటే.. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణశాఖ మంత్రి రాస్‌బేట్స్ ఇటీవలే సింగరేణి భవన్‌ను సందర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై.. మైనింగ్ రంగంలో అధునాతన టెక్నాలజీపై చర్చించారు. వనాడియం, కాపర్, గ్రాఫైట్, కోబాల్ట్ తదితర వాటిపై సింగరేణి-క్వీన్స్‌లాండ్ మధ్య పరస్పర సహకారంపై చర్చలు జరపనున్నారు. సింగరేణి భవన్‌ను సందర్శించిన తొలి విదేశీ మంత్రిగా రాస్‌బేట్స్ నిలుస్తారని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు.

## భారీ శుభవార్త చెప్పిన టీజీఆర్టీసీ
## మహిళలకు, ఇటు పురుషులకు ఇబ్బందులు లేకుండా..



**హైదరాబాద్-నవభూమి:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మార్చి 3, సోమవారం నాడు, నగరంలోని బస్ స్టాప్‌లలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. GHMC ద్వారా 'బస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' బస్సుల స్థానాన్ని ట్రాక్ చేస్తుంది . బస్సులు ఏ సమయంలో వస్తాయి.. ఏ సమయంలో వెళ్తాయి అనే వివరాలను అక్కడ ప్రదర్శిస్తుంది. స్థానిక నివేదికల ప్రకారం.. బస్ స్టాప్‌లలో వేచి ఉన్న ప్రయాణీకులకు బస్సు సమయాలు, దూరాల గురించి తెలియజేయడానికి ఇవి సహాయపడతాయి. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 10,000 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. వీటిలో ప్రధాన 2,000 కిలోమీటర్లలో సిటీ బస్సులు కనిపిస్తాయి. ఆ రోడ్లపై దాదాపు 1,500 బస్ స్టాప్‌లను ఏర్పాటు చేసింది. RTC నగరంలో దాదాపు 3,000 బస్సులను నడుపుతుంది. దాదాపు 20 లక్షల మందికి రవాణాను అందిస్తుంది.

బస్సు లొకేషన్లు , అవి ఏ సమయంలో వస్తాయనే వివరాలను ప్రయాణీకులకు తెలియజేయడానికి బస్ స్టాప్‌లను పునరుద్ధరించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన ప్రణాళిక వేసింది. లండన్‌లో ఉన్నటువంటి హైటెక్ ఫీచర్లతో షెల్టర్‌లను నిర్మించడానికి ఇంజనీరింగ్ విభాగం కృషి చేస్తోంది. ఈ ఆధునీకరణలో భాగంగా.. ఇటీవల 248 కొత్త బస్ స్టాప్‌లను ఏర్పాటు చేశారు.ప్రభుత్వ యాజమాన్యంలోని బస్సులలో ట్రాకర్లను ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా చర్చించాయి. ఈ పరికరాలను హైదరాబాద్‌లోని బస్ స్టాండ్లలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులతో అనుసంధానిస్తారు. డిజిటల్ బోర్డుల స్థాపన అనేది ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా జరుగుతుందని నుండి ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ప్రకటనల ద్వారా ఏజెన్సీ ద్వారా వచ్చే ఆదాయం ద్వారా మాత్రమే ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూరుతాయి. ఈ విధానం ద్వారా నగర ప్రయాణికులకు తక్కువ సమయంలో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. మహాలక్ష్మీ పథకంలో భాగంగా తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం అమలు తర్వాత ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో పురుషులు ప్రయాణించాలంటే ఇన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదెలా ఉంటే..ఏ సమయంలో బస్సులు వస్తాయో.. ఎప్పుడు వెళ్తాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ సమస్య మహిళలకు.. ఇటు పురుషులకు పెద్ద సమస్యగా మారింది. ఈ విధానం వల్ల సమస్యకు పరిష్కారం లభించినట్లే.

బస్సుల నిజ సమయ సమాచారం ప్రదర్శన ద్వారా కలిగే ఉపయోగాల్లో.. ప్రయాణికులకు వేచి చూడాల్సిన సమయం తగ్గుతుంది. బస్ రూట్‌లు, స్టాప్‌ల వివరాల ప్రదర్శన ద్వారా తికమక లేకుండా ఉంటుంది. సిటీ ట్రాఫిక్‌పై ప్రభావాన్ని తగ్గించే అవకాశం కూడా ఉంటుంది.

# కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్రానికి అన్యాయం

**(1వపేజీ తరువాయి)**తెలంగాణలో గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత ఇతర ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. గోదావరి వరద జలాలను బనకచర్లకు తరలిస్తామని అంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఇక నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ తీసుకు వెళ్తున్న అధిక జలాలను ఆపాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను తాము కోరామన్నారు. కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకొని ఈ అన్యాయాన్ని ఆపాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

గోదావరిపై ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తాము అభ్యంతరం చెప్పామని ఆయన స్పష్టం చేశారు. అయితే దీనిపై ఏపీ నుంచి ఎటువంటి నివేదిక రాలేదని.. ఈ అంశంలో తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణకు అధిక నీరు ఇచ్చేలా సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. పాలమూరు రంగారెడ్డి, సమ్మక్క సారక్క, సీతారామ సాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతోపాటు నిధులు సైతం ఇవ్వాలని తాము అడిగాని వివరించారు.

అలాగే కృష్ణా నదిలో శ్రీశైలం, నాగార్జున సాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో టెలి మెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అవసరమైతే.. టెలిమెట్రీల కోసం తెలంగాణ, ఆంధ్రా వాటా ఖర్చు సైతం తామే భరిస్తామని కేంద్రానికి స్పష్టం చేశామని వివరించారు. తమ ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారన్నారు.

మరోవైపు ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి తెలంగాణకు 50 ఏళ్ల పాటు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరామన్నారు. అలాగే మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నుంచి త్వరగా నివేదిక అందేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణ జల వనరుల విషయంలో కేంద్రం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, తాను.. బలమైన వాదనలు వినిపించామని తెలిపారు.

కృష్ణా జలాల వివాదంలో రోజు వారీగా కేంద్రం జోక్యం చేసుకుంటుందని హామీ ఇచ్చిందని చెప్పారు. అదే విధంగా దీర్ఘకాలికంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరాన్నారు. తుమ్మిడిహట్టి సమీపంలో గతంలో కాంగ్రెస్ ప్రతిపాదించి పనులు మొదలు పెట్టనున్నామన్నారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో కూడా కేంద్రంతో చర్చించామన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ విషయంలో సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు.

# స్కూలు భవనం మీద నుంచి దూకిన విద్యార్థిని

**వికారాబాద్-నవభూమి:** పాఠాలు చెప్పడమే కాదు.. పిల్లల మనసెరిగి, వారిని ప్రోత్సహించడమూ ఉపాధ్యాయుల బాధ్యత! అలాంటింది.. ఆ ఇద్దరు మహిళా టీచర్లు ఆ విద్యార్థినిపై పగబట్టారు. గతంలో ఆమె తల్లిదండ్రులతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొని బాలికపై కక్షసాధింపు చర్యలకు దిగారు. బోధనాభ్యాసాల పరంగా ఎప్పటికప్పుడు విద్యార్థినిని నిరుత్సాహపరచడమే కాకుండా స్నేహితులనూ దూరం చేసి బడిలో ఒంటరిని చేసేందుకు ఆమె ప్రవర్తనపైనే విష ప్రచారం మొదలుపెట్టారు. ఆ టీచర్ల అవమానాలను భరించలేక చివరికి ఆ విద్యార్థిని స్కూలు భవనమ్మీద నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వికారాబాద్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొత్లాపూర్‌కు చెందిన యాదయ్య కూతురు తబిత (15) వికారాబాద్ కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు శ్రవంతి, సంధ్య కొన్నాళ్లుగా తబితను ఆమె స్నేహితుల ముందే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. ఆ టీచర్ల తీరుతో స్నేహితులంతా దూరమవడంతో తబిత ఒంటరైంది. ఇటీవల ఆమె క్యారెక్టర్ గురించి ఆ టీచర్లు అభ్యంతరకరంగా మాట్లాడటంతో మనోవేదనకు గురై ఫిబ్రవరి 24న పాఠశాల భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు దూకింది.

ఈ ఘటనలో తబిత కాలు విరిగింది. హాస్టల్ సిబ్బంది వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాలుజారి పడిందంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో వారొచ్చి తబితను ఇంటికి తీసుకెళ్లారు. మహిళా ఉపాధ్యాయుల వేధింపులు భరించలేకే తబిత స్కూలుభవనం మీద నుంచి దూకిందన్న విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగి.. తల్లిదండ్రుల దృష్టికీ వచ్చింది. సోమవారం తబితతో కలిసి పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. చదువు నేర్పిస్తారని పంపిస్తే వేధింపులకు గురిచేస్తారా? అని ప్రిన్సిపల్‌ను, ఉపాధ్యాయులను నిలదీశారు. ఈ సందర్భంగా విద్యార్థి తబిత మీడియాతో ఆవేదనను పంచుకుంది. టీచర్లు తనను తీవ్రంగా అవమానించారని.. 'బయట తిరిగే లక్షణాలు' అంటూ తోటి విద్యార్థుల ముందే తనను వేధించారని, అవమానం భరించలేకే ఆత్మహత్యకు యత్నించానని చెప్పింది. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. బాలికను వేధించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంతజరిగినా ప్రిన్సిపల్ సాయిలత.. విద్యార్థిని తబిత భవనమ్మీద నుంచి కాలుజారి పడిందని చెప్పడం గమనార్హం. ఈ ఘటన తన దృష్టికి రావడంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ విద్యార్థినితో మాట్లాడారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బోణి

**(1వపేజీ తరువాయి)**ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో తొలిసారి బీజేపీ బోణి కొట్టింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందారు. కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

**(1వపేజీ తరువాయి)**చేశారు.అంతే కాకుండా గల్ఫ్ దేశాలలో మరణించిన కార్మికుల కుటుంబాలతో ప్రజా భవన్‌లో త్వరలో గల్ఫ్ అమరుల సంస్మరణ సభ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి వెల్లడించారు. గల్ఫ్ మృతుల కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వారికి భరోసా ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. భారత దేశ సరిహద్దులు దాటి ఎడారి దేశాలలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులు సైనికుల లాంటి వారని, విదేశీ మారక ద్రవ్యం పంపిస్తూ ఆర్థిక జవాన్లుగా సేవలందించిన వారిని 'గల్ఫ్ అమరులు' గా స్మరించుకొని వారిని గౌరవించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఈ 'గల్ఫ్ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అనిల్ గుర్తు చేశారు. గల్ఫ్ కార్మికులు ఆయురారోగ్యాలతో, క్షేమంగా మాతృభూమికి తిరిగి రావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆశిస్తుందని స్పష్టం చేశారు.

## వైసీపీ యూటర్న్?

**(1వపేజీ తరువాయి)**చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల విధానాన్ని తాము అనుసరించామని, అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆ నిర్ణయాన్ని తీసుకున్నామని అన్నారు. ఇప్పుడు ఇదే అంశంపై తమ విధానం ఏమిటనేది ఇప్పటికప్పుడు చెప్పలేమని, పార్టీలో చర్చించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. పార్టీలో డిస్కస్ చేసి చెబుతామని వివరించారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

**(1వపేజీ తరువాయి)**ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీ వనితా రాణిని ఈసీ నియమించింది. మరో ఇద్దరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించిం ది. ఈరోజు నుంచే నామినేషన్లను స్వీకరిస్తారు.

## మెగా డీఎస్సీకి త్వరలో నోటిఫికేషన్

**(1వపేజీ తరువాయి)**సభ్యులతో చర్చించాలని నిర్ణయించాం. సభ్యుల సలహాలు తీసుకుని ముందుకు వెళతాం రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పాఠశాలల వద్ద సీసీ టీవీలు, లైటింగ్

**స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు వేస్తున్నాం..**

గత ప్రభుత్వం హయాంలో 117 జీవోతో నిరుపేదలకు విద్యను దూరం చేశారు. దీంతో 12 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. దీనికి ఓ ప్రత్యామ్నాయంపై సభ్యులతో చర్చించాలని నిర్ణయించాం. సభ్యుల సలహాలు తీసుకుని ముందుకు వెళతాం. రంపచోడవరం నియోజకవర్గంలో 80 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పాఠశాలల వద్ద సీసీ టీవీలు, లైటింగ్ ఏర్పాటు చేస్తాం. 'లెర్నింగ్ ఎక్సెన్స్ ఆఫ్ ఏపీ' కింద సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎలా సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేస్తున్నారో.. అలా మనం కూడా చేద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

**అలా చేస్తే టీవీలు పగిలిపోతాయి: లోకేశ్ వ్యాఖ్య**

మెగా డీఎస్సీపై వైకాపా సభ్యులు అడిగిన ప్రశ్నపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ పార్టీ సభ్యులు హాజరుకానప్పటికీ తాను సమాధానమిస్తానని సభాపతి స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు తెలిపారు. దీనిపై రఘురామ స్పందిస్తూ టీవీలో అయినా వైకాపా సభ్యులు సమాధానం చూసుకుంటారని చెప్పగా.. "అలా చేస్తే టీవీలు పగిలిపోతాయి" అని లోకేశ్ నవ్వుతూ చమత్కరించారు.

## ఉత్తర,దక్షిణ కరోలినాలలో కార్చిచ్చు!

**(1వపేజీ తరువాయి)**బూడిదయ్యింది. ఈ మంటలు అసలు ఇప్పట్లో శాంతించేలా లేవని అధికారులు చెబుతున్నారు. ఆ దేశ వైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ఈ కార్చిచ్చును తొలుత బుధవారం గుర్తించారు. నాడు కనీసం 84 ఇళ్లను ఇది కాల్చేసింది. అదే సమయంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం దాదాపు 4,600 మందిని ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. 1,200 ఇళ్లలోని వారిని అత్యవసర వసతి ప్రదేశాలకు తరలించారు. దాదాపు 1,700 మంది సిబ్బంది మంటలను ఆర్పేందుకు తరలించారు. సహాయక చర్యల కోసం విమానాలను కూడా రంగంలోకి దించారు. 1992లో హెూక్మైడో వచ్చిన కార్చిచ్చుతో పోలిస్తే ఇది చాలా పెద్దది. నాడు అది 1,000 హెక్టార ఆటవీ భూమిని దగ్ధం చేసింది.

## నాగబాబుకు ఎమ్మెల్సీ..ఆ తర్వాత మంత్రి పదవి?

**అమరావతి-నవభూమి:**ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. వీటిలో నాలుగు టీడీపీకి ఒకటి జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోండగా.. జనసేన పార్టీ నుంచి మాత్రం నాగబాబుకు ఖరారైనట్లు సమాచారం.

ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. వీటిలో నాలుగు టీడీపీకి ఒకటి జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోండగా.. జనసేన పార్టీ నుంచి మాత్రం నాగబాబుకు ఖరారైనట్లు సమాచారం. శాసన మండలిలో టీడీపీ నుంచి నలుగురు ఎమ్మెల్సీల పదవి కాలం ముగియనుంది. ఏపీలో ఎమ్మెల్యే కోటాలో మొత్తం 5 ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది.ఈ నెల 20వ తేదీన ఒకే రోజు పోలింగ్.. అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

ఇక ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సైతం ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అందులో ఒకటి జనసేన, మిగతా నాలుగు స్థానాల నుంచి టీడీపీ పోటీ చేయనుంది. ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో.. పార్టీలో అభ్యర్థిత్వాల కోసం తీవ్ర పోటీ నెలకొంది.ఇప్పటికే సీఎం చంద్రబాబు.. జనసేన నేత నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానం నాగబాబుకు ఖరారైనట్లేనని తెలుస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ మంగళవారం 4, మార్చి, 2025



## ఎటీఎస్ వలలో టెర్రరిస్టు.. రామమందిరమే టార్గెట్





**న్యూఢిల్లీ-నవభూమి:** గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ హర్యానాలోని ఫరీదాబాద్‌లోని పాలి ఏరియాలో ఒక టెర్రరిస్టును అరెస్టు చేసింది. అతని నుంచి రెండు గ్రెనేడ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకుంది. కేంద్ర ఏజెన్సీలు, ఫరీదాబాద్ ఎస్‌టీఎఫ్ సహకారంతో గుజరాత్ ఏటీఎస్ ఈ గాలింపు చర్యలు చేపట్టింది. రామమందిరంపై దాడి చేయడం టెర్రరిస్టు టార్గెట్‌లలో ఒకటిగా ఉన్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఫరిదాబాద్‌లో అరెస్టయిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అబ్దుల్ రెహ్మాన్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గ్రెనేడ్‌లను నిర్వీర్యం చేశారు. రెహ్మాన్‌కు టెర్రరిస్టు సంస్థలతో ఉన్న సంబంధం, అతని టార్గెట్‌కు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు అతన్ని గుజరాత్‌కు తరలిస్తున్నారు. రెహ్మాన్ అరెస్టుతో భారీ ఉగ్రదాడి కుట్ర భగ్నమైనట్టు చెబుతున్నారు. కాగా, గుజరాత్ ఏటీఎస్ చేపట్టిన ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు చెప్పారు.

# కేరళవాసిని కాల్చి చంపిన జోర్డాన్ సైన్యం



**జోర్డాన్-నవభూమి:** కేరళకు చెందిన ఓ వ్యక్తి ఇటీవలే ఉపాధి నిమిత్తం జోర్డాన్ వెళ్లాడు. కానీ దురదృష్ట వశాత్తు ఆయనకు వర్క్ వీసాకు బదులుగా విజిట్ వీసా ఇప్పించారు. దీంతో సదరు వ్యక్తి అక్కడి పని చేసుకునేందుకు వీల్లేకపోవడంతో.. బంధువుతో కలిసి అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించబోయాడు. విషయం గుర్తించిన జోర్డాన్ సైనికులు అతడిపై కాల్పులు జరిపారు. ఈక్రమంలోనే సదరు వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఫిబ్రవరి 10వ తేదీన ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే భర్త మృతదేహాన్ని ఎలాగైనా ఇండియాకు పంపించమంటూ మృతుడి భార్య కోరుతుండగా.. భారత విదేశాంగ శాఖ ఏర్పాట్లు చేపట్టింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. కేరళలోని తుంబాకు చెందిన 47 ఏళ్ల థామస్ గాబ్రియేల్ పెరెరా, మేనంకుళంలోలని కిన్ ఫ్రా పార్క్ సమీపంలో ఉన్న 43 ఏళ్ల ఎడిసన్‌లు బంధువులు. అయితే వీరద్దరూ కలిసి ఫిబ్రవరి 5వ తేదీన జోర్డాన్ వెళ్లారు. వర్క్ వీసా ఇప్పిస్తానని చెబుతూ ఏజెంట్ మోసం చేసి.. వీరిని విజిట్ వీసాపై జోర్డాన్ పంపాడు. అక్కడకు వెళ్లాకా అసలు విషయం తెలుసుకున్న థామస్, ఎడిసన్‌లు అక్కడి అధికారులకు దొరక్కుండా ఉండాలని పథకం వేశారు. ఈక్రమంలోనే సరిహద్దు గుండా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. వీరి వెంట మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఉండగా.. ఫిబ్రవరి 9వ తేదీన ఇళ్లకు ఫోన్లు చేసి విషయం చెప్పారు.

ఆపై 10వ తేదీన నలుగురు వ్యక్తులు కలిసి పర్వత లోయ గుండా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలోనే విషయం గుర్తించిన జోర్డాన్ ఆర్మీ సైనికులు వీరిపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో థామస్ గాబ్రియేల్ పెరెరా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇతడి బంధువు ఎడిసన్‌కు గాయాలు కాగా.. అతడిని ఆస్పత్రిలో చేర్చారు. అలాగే మరో ఇద్దరు బాగానే ఉండగా.. వారిని జైల్లో బంధించారు. చికిత్స నిమిత్తం ఎడిసన్‌ను జోర్డాన్ నుంచి బహిష్కరించి తిరిగి ఇండియాకి పంపించారు. ఈక్రమంలోనే అతడు ఇంటికి చేరుకున్నాడు. వచ్చిన వెంటనే థామస్ మృతి గురించి అతడి కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఇలా విషయం తెలుసుకున్న థామస్ భార్య, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. భర్త మృతదేహం పంపిస్తే చివరి చూపైనా చూసుకుంటామంటూ గుండెలవిలేసా రోదిస్తున్నారు. అయితే తాజాగా భారత రాయబార కార్యాలయానికి తమ బాధను చెప్పగా.. థామస్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఇటు కుటుంబ సభ్యులతో అటు జోర్డాన్ అధికారులను కలిసి పని చేస్తూ.. థామస్ మృతదేహం కేరళ తెప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా జోర్డాన్‌లోని భారత రాయబార కార్యాలయం వివరించింది.

## బడ్జెట్‌పై ప్రజల నుంచి సూచనలు కోరిన సీఎం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ బడ్జెట్‌పై బీజేపీ ప్రభుత్వం దృష్టి సారించింది. బడ్జెట్ రూపకల్పనలో ప్రజలు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. డిల్లీ బడ్జెట్‌ను మార్చి 24-26 మధ్య ప్రవేశపెట్టనున్నట్టు ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజల సూచలను చేరుస్తూ 'వికసిత్ ఢిల్లీ' విజన్‌ను బడ్జెట్ ప్రతిబింబిస్తుందని సోమవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ''ఈ బడ్జెట్ 'వికసిత్ ఢిల్లీ' బడ్జెట్. ఇందులో ప్రజలు ఇచ్చే సూచనలను చేర్చే ప్రయత్నం చేస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మహిళలకు ఆర్థిక సాయం, కాలుష్య నియంత్రణ, పేదలకు చవకగా నాణత్య కలిగిన ఆహారం, వయోవృద్ధులకు హెల్త్ ఫెసిలిటీ, గంగా జలాల ప్రక్షాళన వంటి హామీల అమలుకు ప్రయత్నిస్తున్నాం'' అని రేఖా గుప్తా తెలిపారు. మహిళా సమ్మాన్ యోజనతో సహా బీజేపీ ఇచ్చిన హామీలన్నింటినీ బడ్జెట్‌లో చేర్చనున్నట్టు సీఎం తెలిపారు. మార్చి 5న దీనిపై చర్చించేందుకు మహిళా సంస్థలన్నింటినీ విధాన సభకు ఆహ్వానిస్తున్నామనీ, బడ్జెట్‌పై వారంతా తగిన సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని చెప్పారు. బడ్జెట్‌పై సలహాలను వాట్సాప్ నెంబర్ (9999962025)కు పంపాలని ప్రజలను ఆమె కోరారు.

## రూల్స్ మారాయి.. ఈ సర్టిఫికేట్ లేకుంటే.. వీరికి నో పాస్ పోర్ట్..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో పాస్‌పోర్ట్‌కు సంబంధించి కొత్త నియమం అమల్లోకి వచ్చింది. అక్టోబర్ 1, 2023 తర్వాత జన్మించిన వారందరూ ఇకపై పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు తప్పనిసరిగా జనన ధృవీకరణ పత్రాన్ని అందించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం, అక్టోబర్ 1, 2023న లేదా ఆ తర్వాత జన్మించిన దరఖాస్తుదారులకు జనన ధృవీకరణ పత్రం మాత్రమే పుట్టిన తేదీ రుజువుగా పరిగణించబడుతుంది. అదే సమయంలో, పాత దరఖాస్తుదారులు ఇతర పత్రాల ఎంపికను ఎంచుకోవచ్చు. కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 1, 2023న లేదా ఆ తర్వాత జన్మించిన వారు సవరించిన జనన మరణాల నమోదు చట్టం, 2023 కిందకు వస్తారు. కొత్త పాస్ పోర్ట్ నిబంధనల ప్రకారం, ఇకపై వీరు ఇకపై పాస్‌పోర్ట్ దరఖాస్తుతో జనన ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా జతచేయాలి. ఈ తేదీ తర్వాత జన్మించిన దరఖాస్తుదారులు జనన మరణాల రిజిస్ట్రార్, మున్సిపల్ కార్పొరేషన్లు లేదా జనన మరణాల రిజిస్ట్రేషన్ చట్టం, 1969 కింద నియమించబడిన ఏదైనా అధికారం వంటి అధీకృత సంస్థలు జారీ చేసిన జనన ధృవీకరణ పత్రాన్ని అందించాలి. వీరికి జనన రుజువుగా మరే ఇతర పత్రాలు అంగీకరించబడవు. పెద్ద వయసులో జన్మించిన వారికి ప్రత్యామ్నాయ పత్రాలు అందుబాటులో ఉంటాయి.

**జనన ధృవీకరణ పత్రం లేనివారు..**

ఒకవేళ మీరు అక్టోబర్ 1, 2023 ముందు జన్మించినట్లయితే.. మీకు ఇప్పటికీ ఇతర పత్రాలను సమర్పించే అవకాశం ఉంది. పాస్‌పోర్ట్ (సవరణ) 2025 ప్రకారం, బదిలీ సర్టిఫికేట్, స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్, మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్, పాన్ కార్డ్, ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీస్ రికార్డ్ లేదా పెన్షన్ ఆర్డర్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడి కార్డ్, ఎల్ఐసీ లేదా ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన పాలసీ బాండ్లు ప్రత్యామ్నాయ పత్రాల జాబితాలో చేర్చారు.

**సవరణకు కారణాలు..**

జనన తేదీకి సంబంధించిన పాస్‌పోర్ట్ నియమాలు చాలా కాలంగా మారలేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి జనన ధృవీకరణ పత్రాలు లేవు. అయితే, అధికారులు ఇప్పుడు జనన, మరణాల నమోదు చట్టం, 1969ని అమలు చేయడానికి దృఢమైన చర్యలు చేపట్టేందుకు ఈ నియమం తీసుకొచ్చారు. దేశంలో జనన ధృవీకరణ పత్రాన్ని ఒక ముఖ్యమైన పత్రంగా మార్చే దిశగా ఒక పెద్ద అడుగు వేసింది ప్రభుత్వం. ప్రజలకు ఎక్కువ పత్రాలు చూపించాల్సిన పని లేకుండా ఒకే ఒక్క రుజువుతో సులభంగా, వేగంగా పాస్ పోర్టు పొందేలా చేయడమే ఈ నిర్ణయం వెనకగల ప్రధాన ఉద్దేశం. గతంలో జనవరి 26, 1989న, జనన ధృవీకరణ పత్రం తప్పనిసరి చేసినప్పటికీ.. ఎక్కువమందికి లేని కారణంగా నిబంధనలు మార్చారు.

అమల్లోకి వచ్చేది అప్పుడే..పాస్ పోర్ట్ జారీ ప్రక్రియను ఆధునీకరించడం, సరళీకృతం చేయడం, డాక్యుమెంటేషన్‌లో ఎక్కువ స్థిరత్వం, భద్రతను నిర్ధారించడమే లక్ష్యంగా కొత్త నియమాలు ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. అయితే, అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మాత్రమే నిబంధనలు అమల్లోకి వస్తాయి.

**పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల సంఖ్య 600కు..**

పోస్టాఫీసుల ద్వారా నిర్వహించబడుతున్న పోస్టాఫీసు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల సంఖ్యను విస్తరించాలని కూడా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ప్రస్తుతం, 442 'పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు' పనిచేస్తున్నాయి. రాబోయే ఐదు సంవత్సరాలలో ఈ సంఖ్యను 600కి పెంచుతారు. పోస్టాఫీసు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల ద్వారా పాస్‌పోర్ట్ సేవలను నిరంతరం అందుబాటులో ఉంచడం కోసం విదేశాంగ మంత్రిత్వ శాఖ తపాలా శాఖతో ఐదు సంవత్సరాల పాటు అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించింది.

## ఉపాధ్యాయులకు ఆహ్వానం.. విద్యార్థులకు తిరస్కారం మారిన కెనడా వలస విధానం

**న్యూఢిల్లీ-నవభూమి:** కెనడాలో ఉద్యోగం, నివాసం కోరుకుంటున్న భారతీయ ఉపాధ్యాయులకు శుభవార్త. ఐఆర్‌సీసీ(కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వం)లో తాజాగా మార్పులు అలాంటివారికి శాశ్వత నివాసం కల్పించనున్నాయి. విద్యా వ్యవస్థలో ఖాళీల భర్తీ కోసం మరింత మంది టీచర్లు, సహాయక సిబ్బందిని దేశంలోకి రప్పించాలని కెనడా భావిస్తోంది. నిపుణులను దేశంలోకి ఆహ్వానించే ప్రాధాన్యతా వృత్తుల జాబితాను గత గురువారం నవీకరించింది. ఇందులో కొత్తగా టీచర్లు, సహాయక సిబ్బంది, వంటవారిని చేర్చింది. రవాణా రంగాన్ని మొత్తంగా, స్టెమ్ సంబంధిత పలు ఉద్యోగాలను జాబితా నుంచి తొలగించింది. కెనడా విద్యారంగంలో ప్రీ ప్రైమరీ, ప్రాథమిక, సెకండరీ టీచర్లు, సహాయకులు, చిన్నారులకు బోధించేవారు, ప్రత్యేక అవసరాలు గలవారి ఇన్‌స్ట్రక్టర్లను చేర్చారు. అలాగే, మరిన్ని సామాజిక సేవలు, వివిధ టెక్నాలజిస్టులు, టెక్నీషియన్ ఉద్యోగాలతో ఆరోగ్య రంగాన్ని విస్తరించారు.

# వెంటనే పిల్లల్ని కనండి: సీఎం స్టాలిన్ సూచన



**చెన్నై-నవభూమి:** గతంలో పెళ్లైన కొత్త జంటలు వెంటనే పిల్లల్ని కనొద్దని చెప్పిన తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇప్పుడు మాట మార్చారు. పెళ్లి చేసుకున్న వారంతా వెంటనే పిల్లల్ని కనాలని సూచించారు. అంతేకాకుండా వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టమని కూడా వివరించారు. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలతో పాటు దేశ ప్రజలంతా షాక్ అవుతున్నారు. ఇంత అత్యవసరంగా పిల్లల్ని కనమని సీఎం ఎందుకు చెబుతున్నారని తెలుసుకునే పనిలో పడ్డారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చాలా రోజులుగా కేంద్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. జనాభా ప్రతిపాదికన మాత్రమే నియోజక వర్గాలను నిర్ణయిస్తే రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గిపోతాని ఆందోళ చెందుతున్నారు. ఇదే విషయమై మరోసారి స్పందించిన సీఎం ఎంకే స్టాలిన్ షాకింగ్ కామెంట్లు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే ఒకే ఒక్క ప్లాన్ ఉందని చెప్పారు. ముఖ్యంగా నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ప్లాన్ గురించి వివరించారు. గతంలో కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలకు కాస్త ఆలస్యంగా పిల్లల్ని కనమని చెప్పానని ముఖ్యమంత్రి వెల్లడించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయని.. నియోజక వర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుందని.. అందుకే తాను గతంలో చెప్పిన మాటను మార్చుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. గతంలో తాము కుటుంబ నియంత్రణపై మాత్రమే దృష్టి సారించామని కానీ ఇప్పుడు రాష్ట్ర జనాభాను పెంచుకోక తప్పని పరిస్థితుల్లో పడ్డామని వివరించారు. అందుకే తాను రాష్ట్ర జనాభా పెరిగేందుకు కృషి చేస్తున్నానని.. కొత్తగా పెళ్లైన జంటలు అన్నీ వెంటనే పిల్లల్ని కనాలని సూచించారు. వారికి మంచి తమిళ్ పేర్లు కూడా పెట్టాలని చెప్పుకొచ్చారు. నేరుగా ముఖ్యమంత్రియే ఈ కామెంట్లు చేయడంతో అంతా షాక్ అవుతున్నారు. కొందరేమో లోక్‌సభ స్థానాల కోసం తాము వెంటనే పిల్లల్ని కంటామని చెబుతుండగా.. మరికొందరు కష్టం సార్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదంతా ఇలా ఉండగా.. ముఖ్యమంత్రి ఇలాంటి కామెంట్లు చేయడం ఇదే తొలి సారి కాదు. ఇటీవలే ఓ పెళ్లికి వెళ్లిన ముఖ్యమంత్రి.. అక్కడ కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. పరిమితంగా పిల్లల్ని కని సందపతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రమ ప్రచారాన్ని చేపట్టామని.. కానీ దీని వల్ల నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే అవకాశం ఏర్పడిందన్నారు. ఈనెల 5వ తేదీన ఈ అంశంపై చర్చించేందుకు సీఎం అఖిలపక్ష సమావేశానికి కూడా పిలుపునిచ్చారు.

## వైట్‌హౌస్ రచ్చ.. జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా తో సత్సంబంధాలను కాపాడుకోగలనని, ఖనిజాల ఒప్పం దంలో గత వారం ఏకాభిప్రాయం కుదరలేదని, నిర్మాణాత్మక చర్చ కోసం ట్రంప్ ఆహ్వానిస్తే మరోసారి భేటీకి వెళ్తానని, సమస్యలు పరిష్కరించుకోవడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు. మరోవైపు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ.. ఐరోపా భద్రత కోసం నడుం బిగిద్దామని, ఉక్రెయిన్‌కు మంచి జరిగే ఒప్పందంతోనే ప్రతి దేశ భద్రత ఆధారపడి ఉందని అన్నారు. గాజాలోకి వెళ్లే మానవతా సాయం, ఇతర సరఫరాలను మరోసారి నిలిపివేసిన ఇజ్రాయెల్, కొత్త ప్రతిపాదనను హమాస్ అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు తప్పని హెచ్చరించారు. ఇజ్రాయెల్ తీరును ఈజిప్ట్ తీవ్రంగా ఖండించింది. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్‌స్కీల మధ్య జరిగిన వాగ్వాదం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాగా ఉక్రెయిన్ విషయంలో అమెరికాను నమ్మరాని మిత్రుడిగా తాను భావించట్లేదని.. ఆ దేశం తమకు ఎప్పటికీ ముఖ్యమైన మిత్రుడేనని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. కానీ, శాంతి చర్చల సమయంలో ఉక్రెయిన్‌ను బలమైన స్థానంలో ఉంచాలంటే యూరప్ నుంచి ఆ దేశానికి ఆర్థిక సాయం అందాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే.. ఉక్రెయిన్‌కు తాము చేసే ఆర్థిక సాయంలో 2 బిలియన్ డాలర్లతో (దాదాపు రూ. 17,500 కోట్లు) 5000 ఎయిర్ డిఫెన్స్ మిసైళ్ల కొనుగోళ్లకు వీలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఉక్రెయిన్ విషయంలో యూరప్ ఇతోధికంగా కష్టపడాలని.. ఖండంలో శాంతి సాధనకు కృషి చేయాలని, ఈ శ్రమ ఫలించాలంటే అమెరికా అండ అవసరమని పేర్కొన్నారు. ఇటీవల శ్వేతసౌధంలో ట్రంప్-జెలెన్ స్కీ మధ్య జరిగిన వాగ్వాదం గురించి ప్రస్తావించిన ఆయన.. చర్చలు ఆ విధంగా చెడిపోవాలని ఎవ్వరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ఆ ఘటన నేపథ్యంలో.. ఆదివారం ఇక్కడ లండన్‌లోని 200 ఏళ్ల పురాతన లాంకస్టర్ హౌస్‌లో యూరప్ దేశాల అధినేతలు స్టార్మర్ నేతృత్వంలో సమావేశమై చర్చించారు. వారితోపాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని ట్రూడో, టర్కీ విదేశాంగ మంత్రి, నాటో చీఫ్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌కు అమెరికా అండ లేదన్న కఠోర వాస్తవాన్ని అంగీకరించాల్సిందేనని.. ఎప్పుడో తరానికి ఒకసారి వచ్చే ఇలాంటి సందర్భాలను ప్రపంచ దేశాల నాయకులంతా కలిసి ఎదుర్కోవాలని ఈ భేటీ సందర్భంగా వ్యాఖ్యానించిన స్టార్మర్.. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాత్రం అమెరికాను తమకు అత్యంత ముఖ్యుడైన మిత్రుడుగా పేర్కొనడం గమనార్హం. ''అమెరికా యూకేకు ఎన్నో ఎన్నో దశాబ్దాలుగా మిత్రదేశం. ఇకపైనా అలాగే కొనసాగుతుంది. మా రెండు దేశాలు ఉన్నంత సన్నిహితంగా మరే ఇతర దేశాలూ లేవు'' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు.. తాను ఉక్రెయిన్‌లో శాంతి దిశగా రచిస్తున్న ప్రణాళికల్లో అమెరికా అండ కూడా ముఖ్యమేనని ప్రకటించారు. అలాగే.. యుద్ధం ముగించడానికి చేసుకునే ఒప్పందంలో రష్యా కూడా భాగం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకుముందు.. 'సెక్యూరింగ్ అవర్ ఫ్యూచర్' పేరిట నిర్వహించిన సమావేశంలో స్టార్మర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''ఉక్రెయిన్ విషయంలో సానుకూల ఫలితాన్ని రాబట్టడం ఇక్కడున్న ప్రతిదేశానికి, ఇతరులకు సైతం ముఖ్యమైన విషయమే'' అని ఆయన స్పష్టం చేశారు. ''యూరోపియన్ భద్రతను రక్షించుకునేందుకు, మనందరి సమష్టి భవిష్యత్తునూ కాపాడుకునేందుకు.. అందరం కలిసి దీన్ని ఎదుర్కోవాలి'' అని పిలుపునిచ్చారు. అమెరికాతో సంబంధం లేకుండా..తాజా పరిస్థితుల నేపథ్యంలో యూరప్ దేశాలు ఆయుధ పరంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఈ భేటీలో అభిప్రా యపడ్డారు. 2022 నుంచి రష్యా ఆక్రమించుకున్న ఏ భూభాగాన్నీ రష్యాలో భాగంగా యూరోపియన్ యూనియన్ అంగీకరించకూడదని పేర్కొన్నారు. అమెరికాపై ఎంతమాత్రం ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్ పూర్తిస్థాయిలో ఒక ఆర్మీని ఏర్పరచుకోవాలనే ప్రతిపాదనను ఉర్సులా చాలాకాలంగా చేస్తున్నారు.

# చనిపోయిన పిల్లితో మహిళ మూడ్రోజుల సావాసం..



**అమ్రోహా-నవభూమి:** మూడేళ్లుగా ఓ మహిళ పిల్లిని పెంచుకుంటోంది. ఎంతో ప్రేమగా చూసుకుంటూ.. నిత్యం దానితోనే ఎక్కువ సమయం గడుపుతూ వస్తోంది. అయితే మూడ్రోజుల క్రితమే ఆ పిల్లి చనిపోగా మహిళ షాక్ అయింది. విపరీతంగా ఏడుస్తూనే పిల్లి తిరిగి బతుకుంతుందంటూ చెప్పింది. చనిపోయిన పిల్లిని పాతిపెట్టని వ్వకుండా ఇంట్లోనే ఉంచుకుంటానని మొండి పట్టు పట్టింది. ఇక చేసేదేమీ లేక కుటుంబ సభ్యులు కూడా నీ ఇష్టం అని వదిలేయగా.. మూడ్రోజులు పిల్లి శవంతోనే గడిపింది. కానీ అది ఎంత పిలిచినా లేవకపోవడంతో.. ఆమెనే ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఎక్కడ, ఎప్పుడు జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం. ఉత్తర ప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా హసన్‌పూర్‌లో 32 ఏళ్ల పూజ నివాసం ఉంటోంది. అయితే దాదాపు ఎనిమిదేళ్ల క్రితమే ఆమెకు ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. కానీ రెండేళ్లు కూడా గడవక ముందే వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత పూజ పుట్టింటికి వచ్చేసి తల్లి గజ్రా దేవితోనే కలిసి ఉంటోంది. అదే ఇంట్లో ఆమె ఇద్దరు సోదరులు కూడా ఉంటున్నారు. అయితే మూడేళ్లు ఒంటరిగా ఇంట్లోనే ఉన్న పూజకు 3 సంవత్సరాల క్రితం వీధిలో ఓ పిల్లి కనిపించింది. దాన్ని చూడగానే ఆమెకు చాలా సంతోషంగా అనిపించగా.. దాన్ని ఇంటికి తీసుకు వచ్చింది. ఇక అప్పటి నుంచి ఇంట్లోనే ఉంచుకుని దాన్ని పెంచుకుంటోంది. రోజూ ఆహారం పెట్టడం, స్నానం చేయించడం, ప్రత్యేకంగా బట్టలు కుట్టించి వేయడం వంటివన్నీ చేస్తూ రోజూ దానితోనే గడిపేది. ఇలా 3 సంవత్సరాలుగా పూజ ఆ పిల్లికి బాగా అలవాటు పడిపోయింది. అయితే అనుకోకుండా ఈ పిల్లి ఫిబ్రవరి 27వ తేదీ గురువారం రోజు ప్రాణాలు కోల్పోయింది. దీంతో పూజ షాక్ అయింది. విపరీతంగా ఏడుస్తూనే తనకు ఆ పిల్లి కావాలని గోల చేసింది. అది తనకోసం కచ్చితంగా తిరిగి వస్తుందని చెబుతూ పిచ్చిగా వాదించింది. ఈక్రమంలోనే పూజ కుటుంబ సభ్యులు పిల్లి చనిపోయినట్లు గుర్తించి.. దాన్ని పాతి పెడదామని సూచించారు. కానీ పూజ మాత్రం అందుకు అస్సలే ఒప్పుకోలేదు. తనకోసం పిల్లి కచ్చితంగా తిరిగి వస్తుందని చెప్పింది. దాన్ని తనతోపాటు అలాగే ఉంచుకుంటానంటూ మొండి పట్టు పట్టింది. ఎంత చెప్పినా ఆమె వినకపోవడంతో కుటుంబ సభ్యులు కూడా వదిలేశారు. ఈక్రమంలోనే పూజ పిల్లి శవాన్ని వెంట పెట్టుకుని మూడు రోజులు గడిపింది. దాన్ని ఎత్తుకునే తిరిగింది. పదే పదే పిలుస్తూ తనకోసం రమ్మని వేడుకుంది. కానీ పిల్లి ఎంతకూ స్పందించకపోవడంతో అది తిరిగి రాదని అర్థం చేసుకున్న పూజ తాను కూడా చనిపోవాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలోనే శనివారం రోజు మధ్యాహ్నం తన ఇంట్లోని మూడో అంతస్తులో ఉన్న తన గదిలోకి వెళ్లి తాళం వేసుకుంది. ఆపై బెడ్డు మీద పిల్లిని పెట్టి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి 8 గంటలు అవుతున్నా పూజ తినడానికి కిందకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పైకి వచ్చారు. ఈక్రమంలోనే తలుపులు వేసినట్లు చూసి పగులగొట్టారు. అప్పటికే పూజ ఫ్యానుకు వేలాడుతూ చనిపోయి ఉండడం చూసి గుండెలవిసేలా రోదించారు. ఆపై పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

# మెట్రో -ఆటో ఛార్జీలు.. పోలిక పెట్టిన నెటిజన్..



**బెంగుళూరు-నవభూమి:** ఇటీవల బెంగళూరు మెట్రో సంస్థ ఛార్జీలను భారీగా పెంచిన విషయం తెలిసిందే. దీంతో మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య కూడా అనూహ్యంగా తగ్గింది. అయితే.. మెట్రో అండ్ ఆటో ఛార్జీలను పోల్చుతూ బెంగళూరు నివాసి మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ Xలో ఒక పోస్ట్ పెట్టాడు. ఒకే మార్గంలో ఒక సారి ఆటోలో.. మరో సారి మెట్రోలో ప్రయాణం చేసి.. తేడాను చూపించాడు. వాటికి అయ్యే ఖర్చులను తన ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశాడు. మల్లేశ్వర నుండి యెలచెనహళ్లికి మెట్రోలో ముగ్గురు వ్యక్తుల ప్రయాణానికి రూ. 180 ఖర్చవుతుం దని.. ఆటోలో అదే ప్రయాణం.. అంతే దూరానికి రూ. 210 ఖర్చు అని ఆయన పేర్కొన్నారు. ఈ వైరల్ పోస్ట్ నగరంలో ప్రజా రవాణా చార్జీలపై సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఈ అంశంపై ఒక్కో నెటిజన్.. ఒక్కో విధంగా స్పందించారు. మెట్రో ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రయాణాన్ని అందిస్తుంది కాబట్టి మెట్రో ఛార్జీలు సరిగ్గానే నిర్ణయించబడ్డాయని ఒక వినియోగదారుడు అభిప్రాయపడుతూ.. కామెంట్ చేశారు. ట్రాఫిక్ లేకుండా.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేర్చే మెట్రోలో ప్రస్తుతం ఉన్న ధరలు కూడా చాలా తక్కువ అని మరో వ్యక్తి అభిప్రాయం వ్యక్తం చేశాడు. మరో నెటిజన్ ఇలా కామెంట్ చేశాడు. మెట్రో లోపల కనీసం నిలబడటానికి కూడా స్థలం ఉండదని.. నిలబడి నిలబడి కాళ్లకు నొప్పులు వస్తున్నాయని.. దానికి తోడు మెట్రో ఛార్జీలను పెంచడం సరికాదని వాపోయాడు. వీటి కంటే.. ప్రైవేట్ ట్రావెల్స్ బెటర్ అని చెప్పుకొచ్చాడు. మెట్రో కోచ్‌లు ఎప్పుడు రద్దీగా ఉంటాయన్నారు. మరో వినియోగదారుడు.. మెట్రోలోని సౌకర్యాన్ని హైలెట్ చేస్తూ.. ''మెట్రోలో సౌకర్యం - అమూల్యమైనది.. సామాన్యులు ప్రయాణించడానికి మెట్రో దాని ధరలను తగ్గించాలి అనే వాస్తవాన్ని తిరస్కరించడం లేదన్నారు. మరొక నెటిజన్ అనూహ్యంగా తన రూట్‌లో ఛార్జీలు తగ్గాయని.. ఇందిరానగర్ నుండి బైయప్పనహళ్లి వరకు గతంలో 15 రూపాయలు ఉండేది.. ఇప్పుడు అది 10 రూపాయలు అంటూ కామెంట్ చేశాడు.

బెంగళూరులో మెట్రో రైలులో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తగ్గిందని %దీవీ=జూ% వర్గాలు తెలిపాయి. ఈ పెంపు అమలుకు ముందు ప్రతిరోజూ దాదాపు 8.5 లక్షల మంది ప్రయాణికులు మెట్రో రైలులో ప్రయాణిస్తున్నారని వారు తెలిపారు. ఇటీవల బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు ఛార్జీలను 50 శాతం పెంచారు. కొన్ని రూట్లలో ఏకంగా 100 శాతం వరకూ ఛార్జీలు పెరిగాయి. దానికి తోడు.. 'పీక్ అవర్' సమయంలో %BMRCL% 5 శాతం అదనంగా వసూలు చేయడం ప్రారంభించింది. వీటిపై ప్రయాణికులు మండిపడ్డారు. మెట్రో ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. దీంతో భారీగా ఛార్జీలు పెంచిన మార్గాల్లో 30 శాతం తగ్గిస్తూ బెంగళూరు మెట్రో నిర్ణయం తీసుకుంది.


## అభయారణ్యంలో శ్రీశైలానికి సాఫీగా ప్రయాణం

**న్యూఢిల్లీ-నవభూమి:** హైదరాబాద్-శ్రీశైలం రహదారికి మహర్దశ పట్టనుంది. 125 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ జాతీయ రహదారిలో.. అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా వెళ్లే 62 కిలోమీటర్ల దూరం(కల్వకుర్తి-శ్రీశైలం) కేవలం రెండు లేన్ల ఘాట్లతో ఇరుకుగా ఉంటూ.. వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో మలుపుల కారణంగా.. వన్యప్రాణులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ సమస్యకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పరిష్కారం లభించనుంది. ఈ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. 62 కిలోమీటర్ల మేర.. అభయారణ్యంలో 30 అడుగుల ఎత్తులో నిర్మితమయ్యే ఈ రహదారికి రూ. 7,700 కోట్ల ఖర్చవుతుందని అంచనా. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి మన్ననూరు, కుంచోనిమూల, దుర్వాసుల చెరువు ఫరహాబాద్, వటు వర్లపల్లి, దోమలపెంట గిరిజన గ్రామాల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ వెళ్తుంది.

## కష్టపడితేనే 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌ను 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేయాలంటే భారతీయులందరూ కష్టించి పని చేయాలని జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. ఆదివారం బిజినెస్ స్టాండర్డ్ మంథన్‌లో పాల్గొన్న సందర్భంగా మాట్లాడుతూ.. వారానికి 80 గంటలా లేక 90 గంటలు పని చేయాలా అనే కన్నా కష్టించి పని చేయాలన్నది తన ఉద్దేశమని చెప్పారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్లు. ప్రాజెక్టులను కాలం, నిర్మాణ వ్యయాలు హద్దులు దాటిపోకుండా పూర్తి చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన నొక్కి చెప్పారు. వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం రెండింటి మధ్య సమతూకం గురించిన ప్రశ్నకు సమాధానం చెబుతూ.. క్రమశిక్షణతో కూడిన పని జీవితం వల్ల రెండూ సాధించవచ్చని చెప్పారు. రోజుకి గంటన్నర మీ కోసం కేటాయించుకున్నా రోజులో ఇంకా 22.5 గంటల సమయం వృత్తి, వ్యక్తిగత జీవితాలను సమతూకం చేసుకునేందుకు అందుబాటులో ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రజలందరూ కష్టపడి పని చేయకపోతే ఏ దేశం అయినా అభివృద్ధి చెందిన దేశం కాలేదని అన్నారు.



## ఆదివాసీలకు అందని జీవధార!

తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గడ్డ మనది. ఇక్కడి గోదావరి జలాలను ఆంధ్రాకి తరలించే విధానాన్ని తప్పు పట్టి, ప్రాంతీయ వాసులకు న్యాయం జరగాలని గర్జించిన చరిత్ర మనది. కానీ నేడు తెలంగాణలో జరిగేదేమిటి? గోదావరి నది ఒడ్డున ఉన్న ఆదివాసుల జల వనరులు, సహజ వనరులు, ఖనిజ వనరులను దోచుకుంటున్నారు. భారీ ప్రాజెక్టులు నిర్మించి నీటిని బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. మేడిగడ్డ మొదలు కాళేశ్వరం, దేవాదుల, తుపాకులగూడెం, దుమ్ముగూడెం వరకు గోదావరి నది పొడవునా ఇదే దోపిడీ కొనసాగుతున్నది. మునిగేది ఆదివాసీలు, నష్టపోయే భూములు ఆదివాసీలవి, సాగు ఫలం తెలంగాణ మైదానం ప్రాంతాలది!రాష్ట్రంలో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం కోయ గ్రామంలో గోదావరి నది ఒడ్డున సమ్మక్క బ్యారేజ్ నిర్మించారు. నాగరిక ప్రపంచం ఎరుగక, కడు దారిద్ర్యంలో మగ్గుతూ, ప్రకృతిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు మాత్రం ఈ ప్రాజెక్టు నుంచి బిందెడు మంచి నీరు, వ్యవసాయ భూమికి సాగు నీరు అందకపోవటం బాధాకరమైన విషయం.

ములుగు జిల్లాలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏటూరు నాగారం పరిధి పూర్తిగా భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఏరియా భూభాగం, ఇందులో మొత్తంగా 13 మండలాల్లో 3,769 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 500 గ్రామాల్లో ఆదివాసీలు నివసిస్తున్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ తాగునీరు లేక కిలోమీటర్ల మేర నడిచి వెళ్ళి నీరు తెచ్చుకునే పరిస్థితితో పాటు, చెలిమలలో బురద నీరు తాగుతూ రోగాల బారిన పడుతున్నారు. ఇక్కడి గోదావరి నీరు బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు తప్ప, ఆదివాసీల గొంతు తడిపే ప్రయత్నం చేయటం లేదు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని బీడు భూములను సస్యశామలం చేసి ఆదివాసీలని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. నీరు లేక పంటలు సరిగా పండక వలసలు పోయే దుస్థితి ఆదివాసీ ప్రాంతాలలో నెలకొన్నది.ప్రస్తుత సమ్మక్క బ్యారేజి ఎగువన గోదావరి మూలమలుపు దగ్గర నిర్మించిన ప్రాజెక్ట్ నుంచి మెదక్, నల్గొండ, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు పైపులైన్‌ల ద్వారా వ్యవసాయ భూములకు నీటిని తరలించారు. ఈ ప్రాజెక్టు నుంచి ఆదివాసీలకు చుక్క నీరు అందించలేదు. ఆ నీటి దోపిడీ సరిపోదన్నట్టు నేడు సమ్మక్కసాగర్ బ్యారేజి నుంచి కూడా అదే తరహాలో నీటి దోపిడీ చేయటం ఏ మానవతా విలువలకు నిదర్శనం? మరో విషయం 3000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కానీ ఆదివాసీ ప్రాంతాలకు విద్యుత్ వాటాపై స్పష్టత లేదు.తుపాకుల గూడెం బ్యారేజి ప్రాంతం పూర్తిగా భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ప్రాంతం కనుక ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం జరగాలంటే ముందుగా పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ 1998 చట్టం (పెసా) ప్రకారం గ్రామసభ అనుమతి తప్పనిసరి అని ఆదివాసీ ప్రజల నిర్ణయం మేరకు 2016లో తీర్మానం చేశారు. ఇది షెడ్యూల్డ్ ప్రాంతం, పైగా ముంపునకు గురి అవుతుంది కనుక ఈ ప్రాజెక్టులో ఉద్యోగాలు నిర్వాసితులకు పోగా, మిగిలినవి షెడ్యూల్ ట్రైబల్ వారికి ఇవ్వాలి. ప్రాజెక్టులో చేపలు పట్టుకునే హక్కు కల్పించాలి. విద్యుత్ ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పించాలి. తుపాకులగూడెం గ్రామానికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరీ చేయాలి లాంటి అనేక తీర్మానాలు చేశారు. కానీ నేడు ప్రాజెక్ట్ పూర్తి అయ్యే దశలో అధికారులు డొంక తిరుగుడు మాటలు మొదలు పెట్టారు. హామీలు అమలుకు నోచుకునే పరిస్థితి లేదు. స్థానిక ఆదివాసీలకు, వారి రాజ్యాంగపరమైన హక్కులు, చట్టాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?ఇప్పటికి అయినా ప్రభుత్వం స్థానిక ఆదివాసీ గ్రామాల్ని ఐటీడీఏ ద్వారా సర్వే చేయించి వారి భూములకు పైపులైన్ ద్వారా నీరు అందించాలి. ప్రతి కుటుంబానికి రక్షిత మంచి నీటి సౌకర్యం కల్పించాలి. ఆదివాసి ప్రాంతాలలో పెద్ద చెరువులను గుర్తించి వాటికి ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందించాలి. నీటి నిలువకు ప్రత్యేక డ్యామ్స్ ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి. పెసా చట్టం ప్రకారం చేసిన గ్రామసభ తీర్మానాలు తప్పనిసరిగా అమలు చేయాలి.

# ఔరంగజేబు అంత క్రూరుడా



బొల్లోజు బాబా



భారతదేశం అనాదిగా మతవైవిధ్యానికి, భిన్న సంస్కృతుల మేళవింపుకు ప్రసిద్ధి. హిందూ ముస్లిమ్, క్రిస్టియన్‌ల మధ్య సామరస్యాన్ని సూచించే, దర్గాలు, సూఫీ సంతుల పండగలు, పీర్ల ఉత్సవాలు, వేళాంకన్ని ఆరాధన లాంటి సంస్కృతులతో ప్రజలందరూ పరస్పర సహకారం, సహనంతో జీవించారు. ఇటీవల హిందుత్వ శక్తులు ఈ సామరస్యాన్ని ధ్వంసం చేసి సమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంచటానికి ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తున్నాయి.

అజ్మీర్‌లోని ఖ్వాజా మొయినుద్దీన్ చిస్టీ, ఢిల్లీకి చెందిన హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా వంటి సూఫీ సంతుల దర్గాలను హిందువులు ముస్లిములు వచ్చి దర్శించుకొంటారు. ఇవి ఒకరకంగా ఈ రెండు మతాలు కలుసుకొనే చోట్లు. ఈ సహిష్ణుతను నాశనం చేసే ప్రయత్నాలు ఇటీవల చూస్తున్నాం.

ఈ మధ్యకాలంలో చర్చిలపై, క్రైస్తవ విశ్వాసులపై దాడులు జరుగుతున్నట్లు పేపర్లలో చూస్తున్నాం. ఇంట్లో ఎవరికైనా ఒంట్లో బాగోకపోతే మసీదుకు వెళ్ళి తాయత్తు కట్టించుకోవటమో, ఏ చర్చి ఫాదరునో ఇంటికి పిలిపించుకొని ప్రార్థన చేయించుకోవటమో బహుజనులలో అనాదిగా వస్తున్న ఆచారం. కానీ ఈనాడు ఇలాంటి కలయికలు జరగకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు కొందరు. ఇవన్నీ మనుషులమధ్య చిచ్చులు పెట్టి, వారిని విభజించే కుట్రలుగా అర్థం చేసుకోవాలి.

అంతేకాక ఔరంగజేబులాంటి ముస్లిమ్ పాలకులను కొందరు క్రూరపాలకులుగా చిత్రించే ప్రయత్నాలు పదే పదే జరుగుతున్నాయి. అతని పాలనలో జరిగిన కొన్ని సంఘటనలను ముందుకు తీసుకొచ్చి వాటికి లేని పోని కల్పనలు జోడించి దుష్ప్రచారం చేస్తున్నారు. ఇవి ప్రజలను విభజించి, వారిలో ద్వేషభావాలను పెంపొందించటానికి ఉద్దేశించిన ఎత్తుగడలు.

ఔరంగజేబు ఆరవ మొఘల్ చక్రవర్తి. దాదాపు యాభై ఏండ్లు పాలించాడు. భారతదేశ చరిత్రలో ఔరంగజేబు లక్షలాది హిందువులను ఊచకోత కోసాడని, వేలాది ఆలయాలను ధ్వంసం చేసాడని చెబుతారు కానీ వాటికి సరైన చారిత్రిక ఆధారాలు లభించవు. ఔరంగజేబు సోదరులను, సంతానాన్ని హత్యలు చేయించాడని, హిందువులపై జిజియాపన్ను విధించాడని చెబుతారు. ఇంతకు మించి ఔరంగజేబు గురించి చెడు చెప్పటానికి వారివద్ద కూడా ఏమీ ఉండదు. లిలిలిలి

రాజ్యాధికారం స్థిరపరచుకొనే క్రమంలో దాయాదులను తొలగించటం రాచరిక వ్యవస్థలో సహజం. ఈ పని ఔరంగజేబు ఒక్కడే కాదు బాబర్, హుమాయున్, అక్బర్, షాజహాన్ లాంటి ముఘల్ పాలకులందరూ చేసారు. శత్రుశేషం లేకుండా చూడటం రాజ్యంలో అంతర్యుద్ధాన్ని, తిరుగుబాట్లను, అస్థిరతను నివారించటం కొరకేనని రాజకీయనిపుణులు చెబుతారు.

జిజియా పన్ను అనేది ఇస్లామేతర విశ్వాసులు- రాజ్య రక్షణ, మతపరమైన స్వేచ్ఛ పొందేందుకు, మిలటరీ సర్వీసు నుండి మినహాయింపు కొరకు చెల్లించాల్సిన పన్ను. ఇది అల్లాఉద్దిన్ ఖిల్జి కాలంనుండి (1296-1316) అమలులో ఉన్న విధానం. దీనిని1564 లో అక్బర్ నిషేదించాడు. ఔరంగజేబు 1678 లో ఆర్థికకారణాలతో జిజియాపన్నును తిరిగి విధించాడు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, పేదవారు, సన్యాసులు, బిచ్చగాళ్ళు, పిచ్చివాళ్ళు, బ్రాహ్మణులు (అభ్యర్ధనల మేరకు) జిజియాపన్ను నుండి మినహాయించబడ్డారు. అదే సమయంలో ముస్లిములు జకాత్ పన్ను చెల్లించేవారు. మధ్యయుగాల యూరప్‌లో ప్రజలు స్వేచ్ఛగా జీవించటానికి Chevage, pogroms లాంటి పన్నులు ఉండేవి. ఇంతా చేసి ఈ జిజియాపన్ను ఖజానా ఆదాయంలో 1% మాత్రమే. పై రెండు అంశాలపై పండితులు చేసిన విషప్రచారం మాటున ఔరంగజేబు చేసిన ఎన్నో పరిపాలనా సంస్కరణలు మరుగున పడిపోయాయి. ఉదాహరణకు: హిందువులు పుణ్యక్షేత్రాలు సందర్శించుకొనేటపుడు చెల్లించాల్సిన Pilgrim Tax (Ziyarat Tax), వస్తురవాణాపై విధించే Rahdari (Transit Tax), చిరువ్యాపారాలు చేసుకొనేవారిపై విధించే Pandari (Market Tax), వృత్తిపన్ను, వివాహపన్ను లాంటి సుమారు 80 రకాల పన్నులను ఔరంగజేబు రద్దుపరిచాడు. రోజు ప్రజలకు దర్బారు దర్శనం ఇచ్చి అనేక సమస్యలను అక్కడకు అక్కడ పరిష్కరించేవాడు. ఆసుపత్రులు, పేదలకొరకు సత్రాలు నిర్మించాడు.

ఈ రోజు అఖండ భారతదేశం అని దేనినైతే భావిస్తున్నామో దానిలో 90% భూమిని ఔరంగజేబు ఒకే గొడుగుకిందకు తీసుకు వచ్చినట్లు " The Mughal Empire at its height 1707" అనే వికీపీడియా మేప్ చూస్తే అర్థమౌతుంది. మద్యపానం, నల్లమందులకు ఔరంగజేబు దూరంగా ఉన్నాడు. వాటిని రాజాస్థానంలో నిషేదించాడు. రాజ్యంలో కూడా మద్యపాన నిషేదం ఉండేది. చక్రవర్తులకు సహజంగా ఉండే విలాసవంతమైన జీవితాన్ని తిరస్కరించాడు. టోపీలు అల్లి ఖురాన్ కు రాతప్రతులు తీసి, వాటిని అమ్మటం ద్వారా వచ్చిన ఆదాయంతో జీవించేవాడు. ఖజానా నుంచి సొంతఖర్చులకు ధనాన్ని తీసుకొనేవాడు కాదు. తన సమాధి కూడా ప్రజల డబ్బుతో కాక తాను సంపాదించుకున్న సొంత డబ్బులతో నిర్మించమని వీలునామా రాశాడు. ఆప్రకారం దాన్ని 14 రూపాయలతో నిర్మించారు.

ఔరంగజేబు సుమారు 3 శతాబ్దాల క్రితం 23, మార్చ్ 1707 న మహారాష్ట్రలో చనిపోయాడు. అతని చివరి కోర్కెమేరకు అతని గురువైన **Sayyad Zainoddin Shiraizi** సూఫీ వేదాంతి సమాధి మందిరములో అతి సామాన్యంగా ఖననం చేసారు. నేను ఇక్కడికి ఒక అనామకుడిలా వచ్చాను, ఒక అనామకుడిలా నిష్క్రమిస్తున్నాను - ఔరంగజేబు.

హుమాయాన్, షాజహాన్ సమాధులతో పోల్చితే ఔరంగజేబు సమాధి అతను కోరుకొన్నట్లుగానే అనామకంగా మిగిలిపోయింది చరిత్రలో. బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ ఔరంగజేబు సమాధిని పాలరాతితో నేడు మనం చూస్తున్న విధంగా నిర్మింపచేసాడు.


ఔరంగజేబు గతించిన మూడు శతాబ్దాలతరువాత కూడా రాజకీయాలకు ఒక గొప్ప ముడిసరుకుగా మిగిలాడు. తవ్వేకొద్దీ ఓట్లు రాల్చే సాధనమయ్యాడు. ఈ మధ్య యుట్యూబ్‌లో Dr Ram Puniyani వీడియో ఒకటి చూసాను. దానిలో ఔరంగజేబు వివిధ రాజకీయ కారణాలవల్ల 12 ఆలయాలను, కొన్ని మసీదులను ధ్వంసం చేసాడని, వందకు పైగా హిందూఆలయాల నిర్మాణానికి, పోషణకు సహాయపడ్డాడని ఈ అంశాలను శోధించి డా.బి.ఎన్ పాండే పుస్తకం రచించాడని చెప్పాడు. కొద్దిగా వెతకగా Aurangzeb And Tipu Sultan Evaluation Of Their Religious Policies అనే పేరుతో డా. బి.ఎన్. పాండే రాసిన పుస్తకం (1996) కనిపించింది.

నిజానికి ఈ పుస్తకంలోని వివరాలన్ని **Audrey Truschke, Richard M. Eaton** లాంటి వారు తమ రచనలలో అనేక సార్లు ప్రస్తావించారు. (వాటన్నిటికి ఒరిజినల్ సోర్స్ ఈ బి.ఎన్ పాండే రచన). ఈ పుస్తకంలో డా. బి.ఎన్ పాండే ఔరంగజేబు మతపరమైన తటస్థతను పాటించాడని, అనేక హిందూ దేవాలయాలకు,

**మిగతా రేపటి సంచికలో..**

# కార్మికుల భద్రత అత్యంతావశ్యకం






**మార్చ్ 4 జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా..**

పారిశ్రామిక కేంద్రమైన ముంబైలో 1962లో జరిగిన రాష్ట్ర కార్మిక శాఖామంత్రుల సమావేశంలో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలమీద చర్చ జరిగింది. ప్రమాదాల పట్ల కార్మికులలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం నుండి ఒక సంస్థ అవసరమని ఆ సభలో పాల్గొన్నవారు సూచించారు. 1965 డిసెంబరు నెలలో ఢిల్లీలో జరిగిన పారిశ్రామిక భద్రత తొలి సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఇతర సంస్థలు పాల్గొని జాతీయ, రాష్ట్రస్థాయిల్లో భద్రతామండలి ప్రారంభించాలని నిర్ణయించారు. 1966 మార్చి 4న కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రతామండలి ఏర్పడింది. మండలి ప్రారంభమయిన మార్చి 4న ప్రతి సంవత్సరం జాతీయ భద్రతా దినోత్సవం జరుపబడుతుంది. ఉద్యోగులు, కార్మికులు, ఇతర ప్రజలు భద్రత, ఆరోగ్య రక్షణను తమ జీవితంలో భాగంగా నిర్వర్తించుకునేలా చేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.

**మరణాలు పెరుగుతూనే ఉన్నాయి:**

దేశంలో వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ఫలితంగా ప్రమాదాలు, గాయాలు మరణాల సంఖ్య పెరిగింది. ప్రధానంగా తయారీ, నిర్మాణం, మైనింగ్, తయారీ వంటి పరిశ్రమలలో ప్రమాదాలు ఆందోళనను కలిగిస్తున్నాయి. అలాగే ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాల రేటు కలిగిన దేశాలలో ఒకటిగా మన దేశం ఉంది. ఇంకా ప్రకృతి వైపరీత్యాలు, మానవ నిర్మిత విపత్తులు ప్రజల ప్రాణాలకు, ఆస్తికి విస్తృతమైన నష్టాన్ని కలిగిస్తూ పుండుపై కారం జల్లినట్లు తయారయ్యాయి. 2024 సంవత్సరం దేశవ్యాప్తంగా పనిచేసే ప్రదేశాల్లో భద్రతకు భయంకరమైనదిగా ఉందని ఇండస్ట్రీయల్ యూనియన్ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది డిసెంబర్ 10 నాటికి తయారీ, మైనింగ్, ఇంధన రంగాలలో కనీసం 240 ప్రమాదాలు సంభవించాయి. దీని ఫలితంగా 400 మందికి పైగా మరణాలు, 850 మందికి పైగా తీవ్ర గాయాలు అయ్యాయి. వాస్తవ సంఖ్యలు ఎక్కువగా ఉండవచ్చు. రసాయన ఔషధ రంగంలో అత్యంత తీవ్రమైన ప్రమాదాలు జరిగాయి. ఈ రంగంలో 110 కి పైగా పని ప్రదేశాలలో ప్రమాదాలు సంభవించాయి. దీనివల్ల కనీసం 220 మంది కార్మికులు మరణించారు. 550 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మీడియా నివేదికల ప్రకారం, రసాయనాలను కలపడం, నిల్వ చేయడంలో తగినంత జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి భద్రతా లోపాలు పేలుడుకు దారితీశాయి. మైనింగ్ పరిశ్రమలో కనీసం 22 ప్రమాదాలలో 60 మంది కార్మికులు మరణించగా 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇంధన రంగ పని ప్రదేశాలలో జరిగిన ప్రమాదాల్లో 20 మందికి పైగా కార్మికులు మరణించారు.

**భద్రత అవసరం ఎందుకు ?**

దేశం ఆర్థికాభివృద్ధికి, ప్రజల ఉపాధికి పరిశ్రమలు అత్యంతవసరం. ఇదే సందర్భంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు అన్ని విధాలుగా భద్రత కల్పిస్తేనే వారి సేవలు నాణ్యమైన ఉత్పత్తిని అందిస్తాయి. ఉత్పాదకతను మెరుగుపర్చేందుకు సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం, అక్కడ సేవలందించే వారికి భద్రత కల్పించడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం యాజమాన్యాల బాధ్యత. కార్మికులకు ధైర్యాన్ని, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి మంచి సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్వహించడానికి ఉద్యోగుల భద్రత ముఖ్యం. ఇది పరిశ్రమవృద్ధికి, లాభదాయకతకు దోహదం చేస్తుంది. కార్యాలయంలో సురక్షితమైన పరికరాలు, సురక్షితమైన విధానాలను చేర్చడం లాంటి చర్యలు ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించినట్లవుతుంది. వివిధ రంగాలలో పనిచేసే వ్యక్తులు, కార్మికులు నిర్దిష్ట భద్రతా అవసరాలను కలిగి ఉంటారు. పనిప్రదేశ భద్రతను ప్రభావితం చేసే కారకాలలో అసురక్షిత పని పరిస్థితులు, పర్యావరణ ప్రమాదాలు, మాదకద్రవ్య దుర్వినియోగం, కార్యాలయంలో హింస వంటివి ఉంటాయి. ఎలక్ట్రిక్ ఉత్పత్తులు తయారయ్యే పరిశ్రమలలో ఉద్యోగులుకు నాసిరకం వైర్లు లేదా ఎలక్ట్రానిక్స్‌తో ప్రమాదాలు పొంచి ఉంటాయి. నిర్మాణ సంస్థలో భారీ పరికరాలను ఆపరేట్ చేయడం వల్ల ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతారు. వీటిని ఎదుర్కోవడానికి యాజమాన్యాలు తమ కార్యాలయాల్లో భద్రతను నిర్ధారించే వ్యూహాలను రూపొందించాలి. అన్ని కంపెనీలు పెద్ద లేదా చిన్న అనే తేడా లేకుండా తమ పరిశ్రమ లేదా కార్యాలయాలలో భద్రతను పొందుపరచాలి. సురక్షితంగా ఉండాలని పనిచేసే వారందరూ కోరుకుంటారు. భౌతిక భద్రత, సామాజిక భద్రత, ఆర్థిక భద్రత లేదా మరేదైనా భద్రతా అయినా అవ్వొచ్చు. భద్రతకు ప్రాధాన్యత ఉన్నప్పుడు ఉద్యోగి పనితీరు పెరిగి కంపెనీ వృద్ధికి దోహదపడతాయి. ఉద్యోగుల భద్రత కార్మికుల భద్రతను నిర్ధారించడానికి, పనిచేసే ప్రదేశాలలో సురక్షితమైన పరికరాలు, సురక్షితమైన విధానాలను చేర్చడం అనేది ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని అందించడాన్ని సూచిస్తుంది. ధైర్యాన్ని, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి మంచి సురక్షితమైన పని వాతావరణాన్ని నిర్వహించడానికి ఉద్యోగుల భద్రత ముఖ్యం. ఉద్యోగులకు సరైన భద్రతా విధానాలు **కల్పించకపోతే చట్టపరంగా అది నేరమే !**

**పరిష్కారాలు:**

పరిశ్రమలలో ప్రమాదాలను నివారించడానికి, కార్మికుల సురక్షితతను నిర్ధారించడానికి కొన్ని భద్రతా చర్యలు అవసరం. వ్యక్తిగత రక్షణ సామగ్రి (పిపిఇ) ధరించాలి. హెల్మెట్లు, సేఫ్టీ గ్లవ్స్, కళ్ళద్దాలు, సురక్షిత పాదరక్షలు వంటి సామగ్రిని ఉపయోగించాలి. రసాయనాలు లేదా ధూళితో పనిచేసేటప్పుడు మాస్కులు ధరించాలి. యంత్రాలను సురక్షితంగా ఎలా నిర్వహించాలో కార్మికులకు నియమిత శిక్షణ ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల సమయంలో ప్రతిస్పందన గురించి డ్రిల్లులు నిర్వహించాలి. యంత్రాలపై సురక్షిత కవర్లు, గార్డు ఉంచాలి. మెయింటెనెన్స్ సమయంలో "లాకౌట్-ట్యాగౌట్" విధానాలు పాటించాలి. ఈ పద్ధతి పాటించడం వలన గాయాలు, మరణాల నుండి ఉద్యోగులను రక్షించవచ్చు. పరికరాలకు నష్టం జరగకుండా చేయవచ్చు. ఖరీదైన మరమ్మతులు, భర్తీల అవసరాన్ని తగ్గించడానికి కూడా ఇవి సహాయపడతాయి. అగ్ని నిర్వాహక యంత్రాలు, స్మోక్ డిటెక్టర్లు,అత్యవసర నిష్క్రమణ మార్గాలు సిద్ధంగా ఉండాలి. ప్రమాదకర రసాయనాలను సరైన లేబుల్స్, కంటైనర్లలో నిల్వ చేయాలి. వెంటిలేషన్ సౌకర్యాలు, ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్లు పాటించాలి. విద్యుత్ వైర్లు, సాధనాలను తనిఖీ చేసి, ఓవర్లోడింగ్ నివారించాలి. నీరు లేదా తడి ప్రాంతాల్లో విద్యుత్ పరికరాల ఉపయోగం తప్పించాలి. అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. నియమిత కాలంలో యంత్రాలు, విద్యుత్ సిస్టమ్లు, భద్రతా సామగ్రిని తనిఖీ చేయాలి. లోపాలను ఉంటే వెంటనే సరిదిద్దాలి. కార్మికులుచే అధిక గంటలు పనిచేయించగూడదు. భద్రతా కమిటీలు ఏర్పాటు చేసి, సమస్యలను నివారించాలి. పరిశ్రమల్లో భద్రతా నియమాలు కఠినంగా పాటించడం వలన ప్రమాదాలు, ప్రాణనష్టం, ఆర్థిక నష్టాలను తగ్గించవచ్చు. ప్రతి కార్మికుడు భద్రతను ప్రాధాన్యతనిచ్చి జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్యాక్టరీస్ చట్టాలను, ఇతర ప్రభుత్వ నిబంధనలను పరిశ్రమలు అనుసరించాలి. ఉల్లంఘించిన వాటిని మూసివేయించడమే కాకుండా యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలి. ప్రాణ నష్టం జరిగితే సంబంధిత యాజమాన్యలే తగు నష్ట పరిహారం ఇవ్వాలి.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**



## మనలోని సంపదను గుర్తిద్దాం

భక్తి

ఒక సరళమైన విషయాన్ని మీకు చెప్పాలని అనుకుంటున్నాను. ఇది ఏ దేశానికి సంబంధించినదో, ఏ మతానికి సంబంధించినదో కాదు... మీ స్వవిషయం. ప్రతి మానవునికి సంబంధించిన విషయం. జీవించి ఉన్న ప్రతి మానవునిలోనికి శ్వాస నిరంతరం వస్తూ, పోతూ ఉంటుంది. ప్రతి శ్వాసలో అద్వితీయమైన శాంతి దాగి ఉంటుంది. ఇది ఎంతో ఆశ్చర్యకరం. అలాగే ప్రతి శ్వాసలో భగవంతుడి అనుగ్రహం దాగి ఉంటుంది. ఇది అన్నిటినీ మించిన విశేషం.మనమందరం ఈ ప్రపంచంలో పుట్టిన తరువాత... ఒక కానుక రూపంలో మొదటి రోజు లభించింది. ఆ తరువాత రెండో రోజు, అనంతరం మూడో రోజు... ఇలా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు మనకు లభ్యమవుతూనే ఉన్నాయి. కానీ మనలో ఉన్న ఆ పరమానందాన్ని, ఆ సంపదను మనం గుర్తించగలుగుతున్నామా? చివరకు ఒకానొక రోజు వస్తుంది. ఆ రోజు ఈ శ్వాస రాకపోకలు సమాప్తమైపోతాయి. ఉత్త చేతులతో వచ్చిన మనం చివరకు ఉత్త చేతులతోనే అంతమైపోతాం. ఇప్పుడు మీకు ఆసక్తికరమైన సంగతి ఒకటి చెబుతాను. మీలో అంతర్గతంగా ఉన్నదాన్ని అర్థం చేసుకొని, ఆ పరమానందానుభూతిని స్వయంగా పొందితే... ఉత్త చేతులతో జన్మించనప్పటికీ... ఉత్త చేతులతో తిరిగి వెళ్ళరు.నేను సమాజాల గురించో, నగరాల గురించో మాట్లాడను. నేను మనిషి గురించి మాట్లాడతాను. తద్వారా వారి జీవితాల్లో కూడా శాంతి దీపాలు వెలగాలని కోరుకుంటాను. ఎన్నో ఏళ్ళుగా అంధకారంలో ఉన్న మీ హృదయాల్లో... శాంతి జ్యోతులు ప్రజ్వరిల్లి, మీకు లభ్యమైనవాటిని మీరు గుర్తించగలగాలన్నదే నా ఆకాంక్ష. ఎందుకంటే దీపం వెలిగినప్పుడు మాత్రమే అంధకారం తొలగుతుందని, ప్రకాశం ఏర్పడుతుందని మీకు బాగా తెలుసు. అలా జరిగినప్పుడు, మీ జీవితం తేజోవంతమయిందని మీరే చెప్పగలుగుతారు. ఇది స్వయంగా అనుభూతి చెందవలసిన విషయం. దేనికోసం మీరు అన్వేషిస్తున్నారో... అది మీలోనే ఉంది. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇది ఎన్నటికీ మరువకండి. "ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది మీకు దూరంగా ఎక్కడో లేదు. మీలోనే ఉంది. మీరు జీవించి ఉన్నంతకాలం మీలోనే ఉంటుంది" అని యావత్ ప్రపంచం పర్యటించి, పదిమందికీ తెలియజేస్తూ ఉంటాను. అద్భుతాలు చూడాలనే కుతూహలం చాలామందికి ఉంటుంది. కానీ అసలైన అద్భుతం అంటే ఏమిటో తెలియనివారు ఎంతోమంది ఉన్నారు. మీ శ్వాసే అసలైన అద్భుతం. ఎందుకంటే ప్రపంచం మొత్తంలో ఉన్న ధనం అంతటినీ ఖర్చు చేసినా సరే... ఒక్క శ్వాసను కూడా మీరు కొనలేరు. అలాంటి అమూల్యమైన శ్వాస తాలూకు గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి, మీ జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఈనాడు మీరు ప్రాణాలతో ఉన్నారంటే అందుకు కారణం ఏమిటి? మీలోపలికి శ్వాస వస్తూ, పోతూ ఉండడమే! శ్వాసకన్నా విలువైనది ఈ సమస్త విశ్వంలో మరొకటి లేదు. ధనికులైనా, పేదల్కైనా, చదువుకున్నవారైనా, చదువురానివారైనా... ఎవరైనా సరే, వారి జీవితం శ్వాసతో ముడిపడి ఉంటుంది.



## మజ్జిగతో ప్రయోజనాలెన్నో!

ఒక గ్లాసు పలుచని మజ్జిగలో చిటికెడు ఉప్పు వేసుకుని తాగితే శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. వడదెబ్బ తగలదు. జీర్ణాశయ సమస్యలు రావు.

ఒక గ్లాసు మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి కలుపుకుని తాగితే జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పొట్టలో గ్యాస్ సమస్యలు రావు.ఒక కప్పు పెరుగులో ఒకటిన్నర కప్పుల నీళ్లు, అరచెంచా జీలకర్ర పొడి, అర చెంచా అల్లం తరుగు, చిటికెడు ఉప్పు, ఒక చెంచా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి పావుగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ మసాలా మజ్జిగను మధ్యాహ్న సమయంలో తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎండ వేడి వల్ల వచ్చే తలనొప్పి తగ్గుతుంది. మలబద్ధకం రాదు.

ఒక గ్లాసు మజ్జిగలో పావు చెంచా మిరియాల పొడి, పావు చెంచా శొంఠి పొడి వేసుకుని తాగితే కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.తరచూ మజ్జిగ తాగుతూ ఉంటే చర్మం తేమగా కనిపిస్తుంది. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ చర్మ సంబంధిత సమస్యలు రాకుండా చేస్తాయి.మజ్జిగలో పొటాషియం, కాల్షియం, ప్రోటీన్, లాక్టిక్ యాసిడ్, ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు అధికంగా ఉంటాయి. మజ్జిగను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. ఆస్టియోపోరోసిస్ సమస్యలు రావు. తక్షణ శక్తి లభిస్తుంది.ప్రతిరోజూ భోజనం చేసిన గంట తరవాత ఒక గ్లాసు నీళ్ల మజ్జిగ తాగితే అజీర్ణ సమస్యలు రావు.

# తారలు... ప్రకటనలతో చిక్కులు




మన దేశంలో సినీ నటీ నటులకు ఉన్న క్రేజ్ మరెవ్వరికీ ఉండదు. అందుకే వారి ద్వారా వినియోగదారులను ఆకర్షించటానికి అనేక కంపెనీలు పోటీ పడుతూ ఉంటాయి. సబ్బుల దగ్గర నుంచి రియల్ ఎస్టేట్ దాకా క్రిప్టో కరెన్సీ దగ్గర నుంచి ఆన్ లైన్ గేమింగ్ దాకా అనేక కంపెనీల ప్రకటనలలో మనకు సినీ నటీ నటులు కనిపిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ ప్రకటనలు బాగా విస్తరించిన తర్వాత గేమింగ్ యాప్‌లకు.. క్రిప్టో కరెన్సీ స్కీమ్‌ల ప్రకటనలలో కూడా హీరో హీరోయిన్లు కనిపించటం మొదలుపెట్టారు. ఎప్పుడైనా ఈ స్కీమ్‌లు స్కామ్‌లుగా మారితే వారు ఇబ్బందుల్లో పడుతున్నారు.

తాజాగా తమిళనాడు, పుదుచ్చేరిలలో బయట పడిన క్రిప్టో కరెన్సీ స్కామ్‌లో హీరోయిన్లు కాజల్, తమన్నాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ నోటీసులు ఇవ్వటంతో ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.

కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లడా నికి భారీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. రేడియోలు, టీవీలు, ఆన్‌లైన్‌లో రకరకాల ప్రకటనలు ప్రసారం చేస్తూ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. స్టార్ హీరోలు, హీరోయిన్లు, పేరున్న క్యారెక్టర్ ఆర్టిస్టులు, క్రీడాకరులు, ఇతర సెలెబ్రిటీలతో వాణిజ్య ప్రకటనలు రూపొందించి ప్రచారం చేస్తుంటాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయం కూడా ఎక్కువే! ఉదాహరణకు తెలుగులో టాప్ హీరోలకు ఒక ప్రకటనలో నటిస్తే- రెండు నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. ఏడాది మొత్తం ఆ కంపెనీ వీరి ఫోటోలను, వీడియోలను తమ ప్రకటనలలో వాడుకుంటుంది. దీని వల్ల కంపెనీకి పట్ల వినియోగదారులు ఆకర్షితులవు తారు. అదే సమయంలో హీరో, హీరోయిన్లు టెలివిజన్‌లోను, ఆన్ లైన్ లోను ప్రేక్షకులకు కనిపిస్తూ ఉంటారు. దీని వల్ల వారి సినిమాలు విడుదల కావటానికి సమయం పట్టినా ప్రేక్షకులు వారిని మర్చిపోరు. అయితే ఎలాంటి ప్రకటనలలో నటీ నటులు నటించాలి? వారికి సామాజిక బాధ్యత ఉండదా? సమాజానికి కీడు చేసే ప్రకటనలలో ఎందుకు నటించాలి? అనే ప్రశ్నలు ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి. తాజాగా కోటా (రాజస్థాన్) జిల్లా వినియోగదారుల కోర్టు బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవ్‌గన్, టైగర్ ష్రాఫ్‌లు 'విమల్' పాన్ మసాల' ప్రకటనలలో నటించినందుకు వారికి సమన్లు జారీ చేసింది.

**చిక్కులు తప్పవు...**

మన దేశంలో మద్యం, సిగరెట్టు ప్రకటనలపై నిషేధం ఉంది. కానీ రియల్ ఎస్టేట్, బెట్టింగ్ యాప్‌లు, క్రిప్టో కరెన్సీ ప్రకటనలపై నిషేధం లేదు. ఇంటర్నెట్ ప్రతి ఇంటికి వ్యాపించిన తర్వాత.. ప్రతి వ్యక్తి చేతిలో స్మార్ట్ ఫోన్ సామాన్యమయిపోయిన తర్వాత ఈ తరహా ప్రకటనలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. స్మార్ట్‌ఫోన్లలో వీటిని చూసే వారి సంఖ్య పెరిగింది. దీనితో ఈ కంపెనీలు సెలబ్రిటీలకు ఎక్కువ సొమ్ము చెల్లించి ప్రకటనలలో నటించిమని కోరుతున్నారు. కొందరు నటీనటులు తెలిసో.. తెలియకో.. ఈ ప్రకటనల వలలో చిక్కుకుంటున్నారు. గత ఏడాది దేశాన్ని కుదిపేసిన మహదేవ్ బెట్టింగ్ యాప్‌లో అనేక మంది సెలబ్రిటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ప్రశ్నించింది. రణబీర్‌కపూర్, శ్రద్ధకపూర్, తమన్నా మొదలైన వారు కూడా ఈ సెలబ్రిటీలలో ఉన్నారు. అయితే ఈ విషయంలో చట్టాలు కూడా సమగ్రంగా లేవు. "ఒక ఉత్పత్తికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఒక హీరో ఉన్నాడనుకుందాం. ఆ ఉత్పత్తి వల్ల వినియోగదారులకు ఏదైనా నష్టం జరిగితే చట్టపరంగా ఆ హీరోకి ఎటువంటి సంబధం ఉండదు. ఈ విషయం అన్ని అగ్రిమెంట్‌లలో స్పష్టంగా పేర్కొంటారు. కానీ కంపెనీ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిపినప్పుడు.. హీరోకి ఇచ్చిన సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అప్పుడు ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నిస్తారు. ఇక ఒక ప్రకటనలో నటించాలా వద్దా అనే అంశం ఆ హీరోకి ఉన్న నైతికతపై ఆధారపడి ఉంటుంది" అంటారు ఈ తరహా వ్యవహారాలను చూసే న్యాయవాది కావ్య. ఈ మధ్య కాలంలో కుర్ర హీరోలు తమ ఇమేజ్‌ను దెబ్బతీసే ఈ తరహా చర్యలకు పాల్పడటం లేదు. "ఎందుకంటే- ఒక ప్రకటన వచ్చిన వెంటనే లక్షల మందికి చేరిపోతుంది. వెంటనే ఇంటర్నెట్‌లో దానిపై చర్చ మొదలవుతుంది. ఎవరైనా నైతికంగా తప్పు పనిచేస్తే ఈ ?మధ్యకాలంలో నెటిజన్స్ ఊరుకోవటం లేదు. వీరి ఒత్తిడి విపరీతంగా ఉంటోంది. దీనితో ఎక్కువ మంది ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా చూసుకొని కాని ప్రకటనలలో నటించటం లేదు" అంటారు ఒక ప్రొడక్షన్ హౌస్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న సంతోష్. బాలీవుడ్ హీరోలు అనిల్ కపూర్, కార్తీక్ ఆర్యన్, జాన్ అబ్రహం.. శాండిల్‌వుడ్‌కు చెందిన యష్.. టాలీవుడ్‌లో అల్లు అర్జున్ వంటి వారు... పొగాకు ఉత్పత్తుల ప్రకటనలలో నటించబోమని ఖరాఖండిగా చెప్పేశారు.

**అభిమానులను దృష్టిలో...**

మన దేశంలో హీరో, హీరోయిన్లను కోట్ల మంది ఆరాధిస్తూ ఉంటారు. వారిని అభిమానిస్తూ ఉంటారు. నిరంతరం వారిని ఫాలో అవుతూ ఉంటారు. వారు చెప్పిన ప్రతి మాట నిజమని నమ్ముతూ ఉంటారు. అందువల్ల హీరోహీరోయిన్లు తాము చేసే ప్రతి పనిని అభిమానులు గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారి అభిమతానికి.. వారికి హాని చేసే కార్యకలాపాలలో పాల్గొకూడదని నిర్ణయించుకోవాలి. అప్పుడే వారికి ఉన్న విశ్వసనీయత పెరుగుతుంది.

# అప్పట్లో మహిళలకు ఆ అధికారం... మన దేశంలోనే ఉండేది!

అప్పట్లో మహిళలకు ఆ అధికారం... మన దేశంలోనే ఉండేది!

భారత ఉపఖండ చరిత్రలో 18వ శతాబ్దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్యం క్షీణించటంతో అనేక మంది రాజులు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అదే సమయంలో మన దేశంలో బ్రిటిషవారి ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో- అవథ్ రాజ్యం కళలకు కేంద్రబిందువు అయింది. ఆ రోజుల్లోని పరిస్థితుల గురించి, నాటి రాజకీయాలలో మహిళల పాత్ర గురించి ప్రముఖ చరిత్రకారిణి, నవలా రచయిత ఐరా ముఖోటి - 'ది లయన్ అండ్ లిల్లీ- ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ అవథ్' అనే పుస్తకం రాశారు. 'జైపూర్ లిటరరీ ఫెస్టివల్' (జేఎల్ఎఫ)లో పాల్గొంటున్న ఐరాను పలకరించింది.


ఆ శతాబ్దంలో... భారత ఉపఖండంలో అవథ్‌కు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్య పతనం తర్వాత అవథ్ కళలకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారింది. అంతేకాకుండా - ఆ రాజ్య పరిపాలనను రాణులు ప్రభావితం చేశారు. కొన్ని లక్షల మంది కళాకారులు అవథ్ రాజ్యంలో ఉండేవారు. దీనిపై చరిత్రకారులు ఇప్పటివరకూ పెద్దగా దృష్టి సారించలేదు. అలాగే... అవథ్‌పై ఆధిపత్యం కోసం బ్రిటిష్ వారికి ఫ్రెంచ్ వారికి మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాలు చాలా కీలకమైనవి. వీటి ప్రభావం మన దేశ రాజకీయాలపైనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఉంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని అవథ్ గురించి ఈ పుస్తకం రాశాను.

మన దేశ చరిత్రను విదేశీయులు తమ కోణం నుంచి నమోదు చేస్తూ వచ్చారు. ఇప్పుడు మనం వెనక్కి తిరిగి చూస్తే- 17, 18, 19 శతాబ్దాల చరిత్ర ఎక్కువగా బ్రిటిష్ వారి కోణం నుంచే కనిపిస్తుంది. కానీ ఆ సమయంలో మన దేశంలో ఆధిపత్యం సంపాదించటానికి బ్రిటిష్ వారితో పాటు ఫ్రెంచ్ వారు కూడా పోటీ పడ్డారు. అయితే దీని గురించి ఇప్పటి వరకూ ఎవరూ ఎక్కువగా మాట్లాడలేదు. ఆ కోణం నుంచి చూస్తే ఎలా ఉంటుందనే ఉద్దేశంతో... ఆనాటి రికార్డులను, పత్రాలను పరిశీలించటం ప్రారంభించాను. ఈ పుస్తకానికి అవే ఆధారం.

మొఘల్ కాలంలో రాజ్యాలను పాలించిన రాణులు తక్కువ మంది కనబడతారు. ఆ సమయంలో రాజ్యపాలనలో మహిళలు ఎలాంటి పాత్ర పోషించేవారు?

అవథ్ చరిత్రను తిరగేస్తే మనకు అనేక ఆసక్తికరమైన అంశాలు కనబడతాయి. మొఘల్ పరిపాలనా సమయంలో మహిళలు సాంస్కృతిక అంశాలలోనే ముఖ్య పాత్ర పోషిస్తూ ఉండేవారు. కుటుంబ వ్యవహారాల్లో కానీ, రాజకీయ వ్యవహారాల్లో కానీ వారి పాత్ర తక్కువగా ఉండేది. నూర్జహాన్ లాంటి చాలా కొద్దిమంది రాణులను మనం చూడవచ్చు. కానీ అవథ్ రాజ్యంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉండేవి. మహిళలు రాజకీయాంశాలలో కూడా చురుకైన పాత్ర పోషించేవారు. ఇతర రాజకుటుంబాల వారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేవారు. పెళ్లిళ్లు కుదిర్చేవారు. విధాన నిర్ణయాలను తీసుకోవటంలో కూడా ముఖ్య పాత్ర పోషించేవారు. అవథ్ రాజు సాదర్‌జంగ్ భార్య నవాబ్ బేగం కావచ్చు, ఆమె కోడలు బహూ బేగం కావచ్చు... రాజ్య వ్యవహారాలలో చురుకుగా ఉండేవారు. తమ భర్తలు యుద్ధాలకు వెళ్లినప్పుడు వారి తరపున రాజ్యానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేవారు. ఇక్కడ బహూ బేగం గురించి చెప్పుకోవాలి. ఒక రాణిగా ఆమె అనేక ప్రాంతాలను స్వయంగా పరిపాలించేది. ఈ విషయంలో ఆమెకు, అప్పటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్‌కు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అయినా ఆమె తగ్గలేదు. ఇక... అవథ్‌లో కొన్ని వేలమంది కళాకారులు పనిచేస్తూ ఉండేవారు. నర్తకీమణులు, గాయనీమణులు, చిత్రలేఖకులు, చేనేత పనివారు- ఇలా ఎంతో మందికి ఉపాధి లభించేది. ఈ కోణం నుంచి చూస్తే మహిళలకు అవథ్‌లో సముచిత స్థానమే ఉంది.

- ఇది చాలా ఆసక్తికరమైన అంశం. ఆ రోజుల్లో బ్రిటన్‌లో కానీ, ఫ్రాన్స్‌లో కానీ, పోర్చుగల్‌లో కానీ పురుషాధిక్య సమాజాలే ఉండేవి. అక్కడి మహిళలకు మన దేశంలోని మహిళలకు ఉన్నంత స్వేచ్ఛ కూడా ఉండేది కాదు. వారి సమాజాలలో మహిళలు పెళ్లికాక ముందు తండ్రి ఆధీనంలో ఉండేవారు. పెళ్లిఅయిన తర్వాత భర్త ఆధీనంలో ఉండేవారు. అతి తక్కువమంది మహిళలు చదువుకొనేవారు. అందువల్ల మనకు ఆ సమాజాల్లో అధికార హోదాల్లో మహిళలు కనిపించరు. ఇక్కడో ఆసక్తికరమైన విషయం చెప్పాలి. పెళ్లి సమయంలో పుట్టింటివారు తమ ఆడ పిల్లలకు ఆస్తులు ఇవ్వటం పరిపాటి. బ్రిటిష్ చట్టాల ప్రకారం పెళ్లి సమయంలో పుట్టింటివారు ఇచ్చిన ఆస్తులపై ఆడపిల్లలకు ఎటువంటి అధికారం ఉండేది కాదు. పెళ్లి అయిన వెంటనే ఆ ఆస్తులపై అధికారం భర్తలకు బదలాయింపు జరిగేది. ఇదే సమయంలో మన దేశంలో పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తులపై అధికారం మహిళలకే ఉండేది. నూర్జహాన్, ముంతాజ్ బేగం లాంటివారు కూడా తమ పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తుల మీద అధికారాన్ని చెలాయించేవారు. ఈ పద్ధతిని చూసి బ్రిటిషవారు ఒక విధంగా దిగ్భ్రాంతికి గురయ్యారని చెప్పవచ్చు.దురదృష్టమేమిటంటే- ఒకప్పుడు చరిత్రలో ముఖ్యమైన అంశాలను మాత్రమే నమోదు చేసేవారు. దీని వల్ల సామాన్యులకు సంబంధించిన వివరాలు ఎక్కువగా లభించవు. సామాన్య ప్రజలు, మహిళలు ఎలా జీవించేవారో, వారి జీవన ప్రమాణాలు ఎలా ఉండేవో మనకు తెలియదు. అయితే పరోక్షంగా కొన్ని విషయాలు తెలుసుకోగలుగుతాం. 18వ శతాబ్దంలో- బెంగాల్, బిహార్ మాదిరిగానే అవథ్ కూడా చాలా ధనిక ప్రాంతం. నవాబులు, బేగంల దగ్గర ఆర్థిక వనరులు విపరీతంగా ఉండేవి. వారు ఈ వనరులను కళల కోసం, ఇతర సామాజిక ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టేవారు. అవథ్ రాజధానిలో చేనేత కార్మికులకు, నేత పనివారికి ప్రత్యేకమైన ప్రాంతం ఉండేది. ఇక్కడ పనిచేసేవారిలో ఎక్కువ మంది మహిళలే ఉండేవారు. వీరందరికీ వేతనాలు లభించేవి. వారు ఆ వేతనాలను తమ కుటుంబాలకోసం ఖర్చు పెట్టేవారు. ఈ కోణం నుంచి చూస్తే అవథ్‌లో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువ ఉందనే చెప్పవచ్చు.









# ఇలా చేస్తే నల్లని వలయాలు మాయం



**ఒక ఐస్ ముక్కను తీసుకుని పలుచని రుమాలులో చుట్టి దాంతో కళ్లకింద మెల్లగా రుద్దాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునేముందు ఇలా చేస్తూ ఉంటే కళ్ల అలసట తగ్గి క్రమంగా నల్లని వలయాలు మాయమవుతాయి.**

కీరా దోసకాయ లేదా బంగాళదుంపను చక్రాల్లా కోసి వాటిని కళ్ల మీద పెట్టుకుని అరగంట విశ్రాంతి తీసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే కళ్ల కింద రక్త ప్రసరణ మెరుగుపడి నలుపుదనం తగ్గుతుంది.

ఎర్రని టమాటాను శుభ్రంగా కడిగి మధ్యకు కోసి గట్టిగా పిండితే రసం వస్తుంది. ఇందులో దూదిని ముంచి దాంతో కళ్ల చుట్టూ సున్నితంగా అద్దాలి. పది నిమిషాల తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. టమాటాను చక్రాలుగా తరిగి వాటిని కళ్లమీద పెట్టుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది.

ఒక గిన్నెలో ఒక చెంచా బాదం నూనె, ఒక చెంచా ఇ విటమిన్ నూనె వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమంతో కళ్ల చుట్టూ మర్దన చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే వారం రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.

వాడేసిన టీ బ్యాగ్‌లను ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇవి చల్లగా అయ్యాక వాటిని కళ్ల మీద పెట్టుకుని పది నిమిషాలు ఉంచుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే కళ్ల కింద నలుపు తగ్గిపోతుంది.

రెండు చెంచాల కొబ్బరి నూనెలో ఒక చెంచా కలబంద గుజ్జు కలిపి ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. మూడు రోజులపాటు ఇలా చేస్తే కళ్ల కింద నల్లని వలయాలు తగ్గిపోతాయి.

# రాగి వస్తువులు మెరవాలంటే...

రాగితో తయారుచేసిన పాత్రలు, బిందెలు, గ్లాసులు, వాటర్‌బాటిల్స్ లాంటివి ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో జరిగే ఆక్సికరణ చర్యల వల్ల ఇవి నల్లగా మారుతుంటాయి. వీటిని కొత్తవాటిలా మెరిపించే చిట్కాలివి.

**రాగి వస్తువులు మెరవాలంటే...**

ఒక గిన్నెలో నాలుగు చెంచాల ఉప్పు, రెండు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. పలుచని వస్త్రం లేదా స్క్రబ్బర్‌తో ఈ మిశ్రమాన్ని అద్ది దాంతో రాగి వస్తువులను తోమాలి. రెండు నిమిషాల తరవాత మంచినీటితో శుభ్రం చేసి పొడిగుడ్డతో తుడిస్తే అవి కొత్తవాటిలా మెరుస్తాయి.

గిన్నెలో మూడు చెంచాల వెనిగర్, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. దూది ఉండ లేదా పలుచని వస్త్రం సహాయంతో ఈ మిశ్రమాన్ని రాగి వస్తువులకు పూతలా పట్టించాలి. పావుగంటసేపు అలాగే ఉంచాలి. తరవాత తడిగుడ్డతో శుభ్రంగా తుడిస్తే వాటిపై పేరుకున్న నలుపుదనం తొలగిపోతుంది.

టమాటా రసంలో స్క్రబ్బర్ ముంచి దాంతో రాగి వస్తువులను తోమితే వాటిపై పేరుకున్న నలుపుదనం, దుమ్ము, ధూళి తొలగిపోతాయి.

ఒక గిన్నెలో రెండు చెంచాల ముల్తానీమిట్టి, మూడు చెంచాల నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. దీనిని రాగి వస్తువులకు పట్టించాలి. మెత్తని బ్రష్‌తో రెండు నిమిషాలు సున్నితంగా రుద్ది తరవాత నీటితో కడిగితే వాటి నలుపుదనం మొత్తం పోతుంది. ఈ చిట్కా వల్ల వస్తువుల ఉపరితలంపై గీతలు పడకుండా ఉంటాయి.






## ఉద్యోగులకు హోలీ బొనాంజా.. డీఏ 3 శాతం పెంపు..?



న్యూఢిల్లీ-నవభూమి: హోలీ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవుభత్యం) సవరణ చేయనున్నట్లు తెలిసింది. ఈసారి కూడా డీఏను మరో 3 శాతం పెంచనున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం 53 శాతంగా ఉన్న కరవు భత్యం 56 శాతానికి చేరనుంది. అయితే, ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మార్చి 14న హోలీ సందర్భంగా అధికారిక ప్రకటన ఉంటుందని తెలిసింది.ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జులైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జులై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి డీఏ పెంపు 3 శాతంగానే ఉండనున్నట్లు తెలిసింది. కేంద్రం డీఏను సవరించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.




## బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..



న్యూఢిల్లీ-నవభూమి:ఎటువంటి పరిస్థితుల్లోనైనా సురక్షితమైన పెట్టుబడి సాధనం బంగారం. ఇక భారతీయ సంప్రదాయంలో బంగారానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. మరి పసిడిపై పెట్టుబడి పెట్టాలనుకునే వారు, శుభకార్యాలకు కొనుగోలు చేయాలనుకునే వారు పసిడి ధరలపై నిత్యం ఓ కన్నేసి ఉంచాలి. ఇటీవల కాలంలో బంగారం ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.84,460గా ఉంది. ఇక కేజీ వెండి ధర రూ.94,270. బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో పెట్టుబడికి ఇదే సరైన సమయం అని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి

దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలు (24కే, 22కే)
న్యూఢిల్లీ: రూ.84,170బీ రూ.77,156
ముంబై: రూ.84,310బీ రూ.77,284
కోల్‌కతా: రూ.84,200బీ రూ.77,183
చెన్నై: రూ.84,560బీ రూ.77,513
హైదరాబాద్: రూ.84,440బీ రూ.77,403
బెంగళూరు: రూ.84,380బీ రూ.77,348
అహ్మదాబాద్: రూ.84,420బీ రూ.77,385

ఇదిలా ఉంటే, ట్రంప్ సుంకాల విధింపు భయాలు, అనిశ్చిత భౌగోళికరాజకీయ పరిస్థితులు కారణంగా ఈ ఏడాది బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయంగా అనిశ్చితి మరింత పెరిగితే బంగారం ధర రూ.లక్ష మార్కు దాటినా ఆశ్చర్యపోవక్కర్లేదని అంటున్నాయి. అయితే, బంగారం మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా సాధారణ పెట్టుబడి దారులు కేవలం బంగారంపైనే ఆశలు పెట్టుకోకుండా తమ నిధులు వివిధ సాధనాల్లోకి మళ్లించడమే మంచిదని మార్కెట్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## 2034 నాటికి రూ.190 లక్షల కోట్లకు..



న్యూఢిల్లీ-నవభూమి: మన దేశంలో రిటైల్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2014లో రూ.35 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ గత ఏడాది (2024) రూ.82 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో ఏటా సగటున 8.9 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించింది. వృద్ధి రేటు ఇలానే కొనసాగితే 2034 నాటికి భారత రిటైల్ మార్కెట్ రూ.190 లక్షల కోట్లకు చేరుతుందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ)తో కలిసి రూపొందించిన ఒక నివేదికలో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) తెలిపింది.పెరుగుతున్న దేశ జీడీపీ, వినియోగదారుల భిన్న అభిరుచులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించబోతున్నట్టు పేర్కొంది. ఒక్క కొవిడ్ సమయంలో తప్ప మిగతా అన్ని సమయాల్లో మన దేశ రిటైల్ మార్కెట్ సుస్థిర అభివృద్ధినే నమోదు చేసినట్టు తెలిపింది.కాకపోతే రిటైల్ కంపెనీలు ఇందుకోసం ఆయా వర్గాల వినియోగదారుల అభిరుచులు, ఆర్థిక స్థోమతుల ఆధారంగా తమ ఉత్పత్తులు, మార్కెటింగ్ వ్యూహాలు రూపొందించుకోవాలని బీసీజీ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా పట్టణ (ఇండియా), గ్రామీణ (భారత్) ప్రాంత వినియోగదారుల ప్రత్యేక అవసరాలను, ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకోవాలని కోరింది. వినియోగదారుల అభిరుచుల్లో ఉండే వ్యత్యాసాలను ఆకళింపు చేసుకునే రిటైల్ కంపెనీలు మాత్రమే మార్కెట్లో రాణిస్తాయని స్పష్టం చేసింది. ఒకే నగరంలోని వినియోగదారుల అభిరుచులన్నీ ఒకేవిధంగా ఉండవని కూడా తెలిపింది.

నివేదిక ఇతర ప్రధానాంశాలు
కొనుగోలు నిర్ణయాల్లో 'వాల్యూ ఫర్ మనీ' కీలకం
వినియోగదారుల అభిరుచులు-వస్తువుల అందుబాటు ధరల మధ్య సమతూకం ఉండాలి
మన దేశ వినియోగదారుల్లోని భిన్నత్వాన్ని రిటైల్ కంపెనీలు అర్థం చేసుకోవాలి
కొనుగోలు నిర్ణయాల్లో పెరుగుతున్న మహిళల పాత్ర
రిటైల్ రంగంలో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి
ఇంకా ఆఫ్‌లైన్ ద్వారానే 58 శాతం కొనుగోళ్లు
గ్లోబల్ ట్రెండ్స్, బ్రాండ్లపై వినియోగదారుల ఆసక్తి
స్థానిక ఉత్పత్తులకీ మంచి డిమాండ్

## ఉద్యోగాల వృద్ధి బారెడు.. జీతాల వృద్ధి చారెడు

న్యూఢిల్లీ-నవభూమి: దేశంలో నిజ జీతాల వృద్ధి రేటుపై నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ వీర్‌మణి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడేళ్లలో దేశంలో ఉద్యోగ అవకాశాలు పెరిగినా, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా నిజ జీతాల్లో మాత్రం ఎదుగూ బొదుగూ లేదన్నారు. ఈ కాలంలో ఉద్యోగాల కల్పన జనాభా వృద్ధికి మించి జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2023 జూలై నుంచి 2024 జూన్ మధ్య జరిగిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫఎస్) ప్రకారం 2023-24లో అన్ని వయసుల జనాబాలో పని చేసే జనాభా 43.7 శాతం ఉందన్నారు. 2017-18తో పోలిస్తే ఇది 9 శాతం ఎక్కువన్నారు. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే అధిక జనాభా మన దేశానికి ఒక గొప్ప అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలని వీర్‌మణి స్పష్టం చేశారు. ఇందుకోసం మన విద్యా విధానంలో బోధన, శిక్షణను మెరగు పరుచుకోవడం అత్యంత ముఖ్యమన్నారు.నైపుణ్యాల కొరతే కారణం: రెగ్యులర్ ఉద్యోగులతో పోలిస్తే గత ఏడేళ్లలో తాత్కాలిక ఉద్యోగుల జీతాల పెరుగుదలే బాగుందని వీర్‌మణి స్పష్టం చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో సరైన విద్య, నైపుణ్యాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఇందుకు మన విద్యా వ్యవస్థ కూడా కారణమన్నారు. ప్రత్యేక నైపుణ్యాల అవసరం ఉన్న కొన్ని రెగ్యులర్ ఉద్యోగాలకు ప్రస్తుతం అభ్యర్థులే దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాలూ కలిసి రావాలని ఆయన కోరారు. ఇందుకోసం జిల్లా స్థాయి నుంచే పని ప్రారంభం కావాలన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు పెరిగితే ఉత్పాదకత, ఉత్పాదకత పెరిగితే ఉద్యోగుల నిజ జీతాలూ పెరుగుతాయని వీర్‌మణి అన్నారు.

# స్టాక్ మార్కెట్ మోసాల కేసు.. సెబీ మాజీ చీఫ్‌కు కాస్త ఊరట



ముంబై-నవభూమి: స్టాక్ మార్కెట్ మోసాల కేసులో సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు కాస్త ఊరట లభించింది. మాధవి, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశాలపై చర్యలు తీసుకోవద్దని బాంబే హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై మాధవి పురి బుచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ముంబై ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించించిన విషయం తెలిసిందే. దీనిపై మాధవి, హోల్ టైమ్ సభ్యులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్ష్నీ, బీఎస్ఈ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సీఈవో సుందరరామన్ రామమూర్తిలు హైకోర్టులో వ్యక్తిగతంగా పిటిషన్లు దాఖలు చేశారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను బాంబే హైకోర్టు అత్యవసర విచారణకు స్వీకరించింది.

రేపు వీటిపై విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశాలపై మంగళవారం వరకూ చర్యలు తీసుకోవద్దని మహారాష్ట్ర అవినీతి నిరోధక విభాగాన్ని జస్టిస్ శివకుమార్ డిగే ఆదేశించారు.

**సెబీ మాజీ చీఫ్‌పై ఎఫ్ఐఆర్**

స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించింది. నియంత్రణకు సంబంధించిన లోపాలు జరిగినట్లు, కుమ్మక్కు అయినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, వీటిపై న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని తెలిపింది.

దర్యాప్తును తాను పర్యవేక్షిస్తానని జడ్జి తెలిపారు. ఓ మీడియా రిపోర్టర్ దాఖలు చేసిన ఫిర్యాదుపై ఈ ఆదేశాలను ఇచ్చారు. ఓ కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మోసపూరితంగా లిస్టింగ్ చేశారని, ఇదంతా రెగ్యులేటరీ అథారిటీస్ చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల జరిగిందని తెలిపారు.

అదానీ విదేశీ ఫండ్లలో స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' చైర్ పర్సన్ మాధబీ పురీ బుచ్ ఆమె భర్తకు వాటాలున్నాయని షార్ట్ సెల్లింగ్ సంస్థ, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపింది. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్‌కు పార్ల మెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమన్లు కూడా జారీ చేసింది. అయితే, ఆ తర్వాత విచారణ అనంతరం ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.

## విదేశీ మదుపర్ల బెంగ.. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్‌పై అమ్మకాల ఒత్తిడి.. నష్టాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..!



న్యూఢిల్లీ-నవభూమి: నిరంతరాయంగా విదేశీ మదుపర్లు నిధులు విత్‌డ్రా చేయడంతో బ్లూ చిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ నష్టాలతో ముగిశాయి. వరుసగా రెండో సెషన్‌లో బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 112.16 పాయింట్లు (0.15 శాతం) నష్టపోయి 73,085. 94 పాయింట్ల వద్ద ముగిసిం ది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 73,649. 72పాయింట్ల గరిష్టం నుంచి 72,784.54 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనమైంది.ఇక, మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా తొమ్మిదో రోజు నష్టాలతో ముగిసింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 5.40 పాయింట్ల పతనంతో 22,119.30 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 120 పాయింట్లు పతనమై 22,004.70 పాయింట్లకు పడిపోయింది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మారుతి సుజుకి ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్ తదితర స్టాక్స్ నష్టపోయాయి. మరోవైపు అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సెన్ అండ్ టర్బో, ఎస్బీఐ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి.ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్ లాభాలతో ముగిస్తే, షాంఘై నష్టాలతో స్థిర పడింది. సియోల్ స్టాక్ మార్కెట్‌కు సోమవారం సెలవు. యూరోపియన్ మార్కెట్లు సానుకూలంగా స్థిర పడ్డాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.58 శాతం తగ్గి 72.89 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

### 1,000 మందిపై వేటుకు సిద్ధమైన ఓలా ఎలక్ట్రిక్..

## ఐదు నెలల్లోనే రెండో రౌండ్ లేఆఫ్స్




న్యూఢిల్లీ-నవభూమి:ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 1,000 మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని యోచిస్తోంది. నష్టనివారణ చర్యల్లో భాగంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

సంస్థ ఖర్చులను తగ్గించి, నిర్వాహక సామర్థ్యం పెంచేందుకు ఓలా ప్రయత్నిస్తున్నట్లు మీడియా కథనాలు నివేదిస్తున్నాయి. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఈ కోత ఉండనున్నట్లు సమాచారం. తొలగింపు వార్తల తర్వాత ఓలా ఎలక్ట్రిక్ షేర్లు కూడా 5 శాతం పడిపోయినట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల్లోనే ఓలా ఎలక్ట్రిక్‌లో ఇది రెండో రౌండ్ తొలగింపులు. గతేడాది నవంబర్‌లో ఓలా ఎలక్ట్రిక్ దాదాపు 500 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా వెయ్యి మందిపై వేటు వేసేందుకు సంస్థ సిద్ధమైంది.కాగా, ఇటీవలే కొన్ని రోజులుగా ఓలా ఎలక్ట్రిక్ పలు వివాదాలతో సతమతమవుతోన్న విషయం తెలిసిందే. సంస్థ కార్యకలాపాలు, సేవలపై వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వినియోగదారుల హక్కులు ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ విషయంపై సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఓలా ఎలక్ట్రిక్‌కు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. అంతేకాదు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కమెడియన్ కునాల్ కమ్రా, భవీశ్ అగర్వాల్ మధ్య వివాదం కూడా నెలకొన్న విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో సంస్థ లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లకు ట్రంప్ కష్టాలే!




న్యూఢిల్లీ-నవభూమి:దేశీయ స్టాక్ మార్కెట్లను వరుస నష్టాలు వీడటం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. మదుపరులను అమ్మకాల ఒత్తిడిలోకి నెడుతున్నాయి. దీంతో సూచీలు భారీ పతనాలను చవిచూస్తున్నాయి. గత వారం కూడా ఇదే జరిగింది. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,112.96 పాయింట్లు లేదా 2.80 శాతం పతనమై 73,198.10 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 671.20 పాయింట్లు లేదా 2.94 శాతం క్షీణించి 22,124.70 దగ్గర స్థిరపడింది. నిజానికి ఫిబ్రవరి మొదలు భారతీయ ఈక్విటీలకు ఏమాత్రం కలిసిరావడం లేదు. కేంద్ర బడ్జెట్, ఆర్బీఐ ద్రవ్యసమీక్షలూ మెప్పించలేకపోయాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల ప్రకటనలు.. ఇన్వెస్టర్లను పెట్టుబడులకు మరింతగా దూరం చేస్తున్నాయి. ఈ వారం కూడా ఇదే తంతు కొనసాగవచ్చని మెజారిటీ నిపుణుల అంచనా. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను విడుదలైన జీడీపీ గణాంకాలు నిరాశాజనకంగానే ఉన్నాయి. వీటి ప్రభావం కూడా ఈ వారం మార్కెట్ ట్రేడింగ్‌పై ఉండనున్నది. అటు ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే ఆల్‌టైమ్ కనిష్ఠాల వద్ద కదలాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయవచ్చు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 21,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 21,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 22,400-22,600 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడుదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం.

అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# ఇలా చేస్తే.. 17 లక్షలున్నా నో ట్యాక్స్!

న్యూఢిల్లీ-నవభూమి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వేతన జీవుల కోసం కొత్త ఐటీ విధానాన్ని మరింత ఆకర్షణీయంగా సవరించారు. ఏటా రూ.12.75 లక్షలదాకా పన్నులుండబోవన్నారు. ఇది దాటితే మాత్రం రూ.4 లక్షల నుంచి శ్లాబులవారీగా పన్నులు వర్తిస్తాయి. అయితే సీటీసీ రూ.17.25 లక్షలున్నా కొత్త ఐటీ విధానం కింద పన్ను మినహాయింపును పొందే వీలున్నదని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. మరి అందుకు ఏం చేయాలో తెలుసా?..సీటీసీ అంటే కాస్ట్ టు కంపెనీ. ఇంకా సరళంగా చెప్పాలంటే ఓ కంపెనీ తమ ఉద్యోగికిచ్చే మొత్తం సాలరీ ప్యాకేజీ. ఇందులో బేసిక్ పే, ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ఆర్ఏ), ఆరోగ్య బీమా, ట్రావెల్ అలవెన్స్ (టీఏ), ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్), నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) మొదలగున అన్ని అలవెన్సులు, సేవింగ్స్ విరాళాలు, ప్రత్యక్ష-పరోక్ష ప్రయోజనాలుంటాయి.కొత్త ఐటీ విధానంలోనూ అలవెన్సులకు పన్ను మినహాయింపులుంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. కానీ వాటికి అనుగుణంగా ఉద్యోగులు తమ వేతన నిర్మాణాన్ని మార్చుకుంటేనే ఆ ప్రయోజనాలను అందుకోవచ్చనివారు చెప్తున్నారు. నిజానికి ఈ అలవెన్సులకు అనుగుణంగా సాలరీ స్ట్రక్చర్‌ను మార్చుకోవచ్చని ఐటీ చట్టంలోనూ ఉందని గుర్తుచేస్తున్నారు. దీంతో సాధారణంగా వచ్చే అలవెన్స్, విరాళాలతోపాటు కొన్ని రీయింబర్స్‌మెంట్లను జోడిస్తే పన్ను సహిత ఆదాయాన్ని భారీగా తగ్గించుకోవచ్చు.

## ఆలస్యం.. అమృతం.. విషం పొదుపు, పెట్టుబడికి త్వరపడండి




న్యూఢిల్లీ-నవభూమి:ఆర్థిక వ్యక్తిత్వ వికాసం పొదుపు, పెట్టుబడులతోనే ఇనుమడిస్తుంది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్లలో మీరు తీసుకునే నిర్ణయాలే మీ భవిష్యత్తును నిర్దేశిస్తాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. పర్సనల్ ఫైనాన్స్‌లో ఈ రెండింటికి అంత ప్రాధాన్యత ఉన్నది మరి. అయితే చిన్న వయసు నుంచి పొదుపు, పెట్టుబడులకు దిగితేనే వాటి ప్రయోజనాలను ఎక్కువగా అందుకోవచ్చన్నది మరువద్దు. అందుకే యుక్త వయసులోనే లేదా సంపాదన ప్రారంభించిన తొలినాళ్లలోనే పక్కా ప్లానింగ్‌తో పొదుపు, మదుపునకు దిగాలని గుర్తుంచుకోండి.

**ప్రయోజనాలివే..**

తల్లిదండ్రులు తమ పిల్లల పేరిట పొదుపు చేయాలనుకుంటే వారి చిన్నప్పుడే దానికి శ్రీకారం చుట్టడం లాభదాయకం. దీనివల్ల చిన్నచిన్న మొత్తాలతోనే ప్రారంభించే అవకాశం ఉంటుంది. పిల్లల ఉన్నత విద్య, పెండ్లి ఇతరత్రా ఖర్చులకు ఉపయుక్తంగా ఉంటుంది.

ఇన్సూరెన్స్ వంటివి తీసుకుంటే తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. జీవిత బీమా లేదా ఆరోగ్య బీమా దేనికైనా వయసు ఆధారంగానే ప్రీమియంలుంటాయి. కాబట్టి చిన్న వయసులో బీమా చాలాచాలా మంచి నిర్ణయం. ఎక్కువ కవరేజీ కూడా లభిస్తుంది. చదువు పూర్తయ్యి, ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచే దీర్ఘకాలిక లక్ష్యాల సాధన కోసం ప్రయత్నించాలి. తద్వారా లక్ష్యాలను చేరుకోవడానికి మరింత సమయం దొరుకుతుంది.

ఇల్లు, రిటైర్మెంట్ ప్లాన్ తదితర లక్ష్యాల కోసం రకరకాల పెట్టుబడి మార్గాలున్నాయి. వాటిని పరిశీలించి మీకు అనువైనదేదో గుర్తిస్తే ఆశయం త్వరగా నెరవేరుతుంది.

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ఎంచుకోవచ్చు. కొద్దికొద్ది మొత్తాల్లో పెట్టుబడికి ఇవి అనువైనవి. అయితే మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌లతో కూడుకున్నవి. వీటికి దిగేముందు నిపుణులను సంప్రదిస్తే ఉత్తమం.

ఖర్చులను తగ్గించుకోవడం కూడా పొదుపే. అయితే ఏది అవసరం, ఏది అనవసరం అన్నదాని మధ్య వ్యత్యాసాన్ని గుర్తించగలగాలి. ఆపై మిగిలిన సొమ్ముతో పొదుపునకు ప్లాన్ చేసుకోండి. చిన్నమొత్తాలే కదా అని తీసిపారేయొద్దు. అవన్నీ కలిసి పెద్ద మొత్తం చేతికందగలదు.


**కొన్ని పాపులర్ సేవింగ్స్-ఇన్వెస్ట్‌మెంట్స్..**

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్: ఏటా రూ.1.5లక్షలదాకా పెట్టుబడి పెట్టవచ్చు. రిస్క్ తక్కువ. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు కూడా ఉంటుంది. ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్, వాలంటరీ ప్రావిడెంట్ ఫండ్లనూ ఎంచుకోవచ్చు.

మ్యూచువల్ ఫండ్స్: మ్యూచువల్ ఫండ్స్ అనేవి స్టాక్ మార్కెట్ ఆధారిత పెట్టుబడులు. జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే లాభదాయకం. ఈఎల్ఎస్ఎస్‌కు పన్ను ప్రోత్సాహకాలూ లభిస్తాయి.

గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్: బంగారం అనేది ఓ సురక్షిత పెట్టుబడి సాధనం. నగల రూపంలోనే కాదు.. గోల్డ్ ఈటీఎఫ్‌ల రూపంలోనూ ఇన్వెస్ట్‌మెంట్‌కు దిగవచ్చు. స్టాక్ మార్కెట్లలో మదుపు చేసేవారికి అక్కడి ఒడుదొడుకులను తట్టుకొనేందుకు, ద్రవ్యోల్బణం ప్రభావాన్ని అధిగమించేందుకు గోల్డ్ చక్కగా ఉపయోగపడుతుంది. సిల్వర్ ఈటీఎఫ్‌లూ ఉన్నాయి.పోస్టాఫీస్ సేవింగ్స్ స్కీం: ఎలాంటి రిస్క్‌లనూ ఇష్టపడనివారు పోస్టాఫీస్ సేవింగ్స్ స్కీంలను ప్రయత్నించవచ్చు. కేంద్ర ప్రభుత్వం భరోసా వీటికున్న బలం. ఆకర్షణీయ వడ్డీరేటు, గ్యారంటీడ్ రిటర్న్స్ ఈ పథకాల సొంతం.యులిప్స్: యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు. అటు జీవిత బీమా, ఇటు పెట్టుబడిగా పనికొస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు ఇవి అనువైనవి. సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్స్, పన్ను ప్రోత్సాహకాలు వంటి ఉంటాయి. ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తే ఎక్కువ ప్రయోజనం.బాండ్లు: ప్రస్తుతం చాలా ప్రభుత్వ బాండ్లు ద్రవ్యోల్బణ సవాళ్లను అధిగమించే ప్రతిఫలాలను అందిస్తున్నాయి. పైగా రిస్క్ తక్కువ. నిర్ణీత ఆదాయం ఉంటుంది. సావరిన్ గోల్డ్ బాండ్లు, కేంద్రం తరఫున రిజర్వ్ బ్యాంక్ జారీచేసే ట్రెజరీ బిల్లుల్లోనూ మదుపునకు వీలుంటుంది. కార్పొరేట్ బాండ్లకూ డిమాండ్ ఉంటున్నది.

ఎఫ్‌డీ-ఆర్‌డీ: బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)కు మన దేశంలో ఎంతటి ఆదరణ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిర్దిష్ట వడ్డీరేటు, నిర్ణీత కాలపరిమితితో ఎలాంటి రిస్క్ లేకుండా ఆదాయాన్ని పొందవచ్చు. అలాగే బ్యాంకులు అందించే టర్మ్ డిపాజిట్లైన రికరింగ్ డిపాజిట్ల (ఆర్‌డీ)నూ పరిశీలించవచ్చు. మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లూ ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వ పథకాలు: కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీములను కూడా మదుపరులు ప్రయత్నించవచ్చు.



## బూతు జోకులు ప్రతిభ అనుకుంటున్నావా..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ నెల 7న 'ఇండియాస్ గాట్ లేటెంట్ షో' లో బూతు వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్లహబాదియా కు సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టింది. హాస్యం కోసం పబ్లిక్ షోలలో బూతు జోకులు వేయడం ప్రతిభ అనుకుంటున్నావా..? అని మందలించింది. అదే సమయంలో ఆయన తన 'ది రణ్‌వీర్ షో ' ను పునఃప్రారంభించడానికి సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది.అయితే తన షోలో చేసే ప్రసారాలు మన సామాజిక నిబంధనలకు లోబడి ఉండాలని సూచించింది. ఏదైనా ప్రోగ్రామ్‌లో ప్రసారం చేయకూడని అంశాల గురించి, అందుకు సంబంధించిన నియమ నిబంధనల గురించి ప్రభుత్వం ప్రచారం చేయాలని సూచించింది. తన 'రణ్‌వీర్ షో' పునఃప్రారంభానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ రణ్‌వీర్ అలహాబాదియా దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు పైవిధంగా స్పందించింది.కాగా ఇండియాస్ గాట్ లేటెంట్ షోలో ఈ నెల 17న యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా ఓ కంటెస్టెంట్‌కు బూతు ప్రశ్న వేశాడు. మీ పేరెంట్స్ శృంగారాన్ని మీరు ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారా..? లేదంటే అంతటితో ఆపేస్తారా..? అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న నెటిజన్‌లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. పబ్లిక్ షోలో ఇలాంటి ప్రశ్న అడగటం ఏమిటని పలువురు మండిపడ్డారు. దాంతో రణ్‌వీర్ షోను బ్యాన్ చేశారు. ఆయనపై కేసులు నమోదు చేశారు.

## జేసీబీని డ్రైవ్ చేసిన బాలుడు.. తర్వాత ఏం జరిగిందంటే?



**చెన్నై- నవభూమి:** తవ్వకాలు జరిపే జేసీబీని మైనర్ బాలుడు నడిపాడు. అదుపు కోల్పోవడం తో రోడ్డు పక్కగా పార్క్ చేసిన ఆటోలను ఢీకొట్టాడు. దీంతో పలు ఆటోలతో పాటు బైకులు, కారు ధ్వంసమయ్యాయి. ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తమిళనాడులోని మధురైలో ఈ సంఘటన జరిగింది. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో 17 ఏళ్ల యువకుడు జేసీబీని నడిపాడు. సెల్లూర్ ప్రాంతంలో సుమారు అర కిలోమీటరు దూరం వరకు దానిని డ్రైవ్ చేశాడు.కాగా, భారీ వాహనమైన జేసీబీపై ఆ యువకుడు నియంత్రణ కోల్పోయాడు. దీంతో రోడ్డు పక్కన పార్క్ చేసిన ఆటోలపైకి అది వేగంగా దూసుకెళ్లింది. పలు ఆటోలతోపాటు బైకులు, కారు, అక్కడున్న స్థలం వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ షీట్ ధ్వంసమయ్యాయి. సెక్యూరిటీ గార్డు కూడా గాయపడ్డాడు.మరోవైపు పెద్ద శబ్దం విన్న స్థానికులు ఏం జరిగిందో తెలియక భయాందోళన చెందారు. జేసీబీ నడిపిన యువ కుడ్ని చూసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ యువకుడు జేసీబీపై నియంత్రణ కోల్పోయాడా లేక ఉద్దేశపూర్వకంగా ఆటోలపైకి దూకించాడా అన్నది దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆటోలపైకి జేసీబీ దూసుకెళ్లిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## కన్నడను విస్మరించిన రష్మికకు గుణపాఠం చెప్పాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే



**న్యూఢిల్లీ-నవభూమి:** 16వ బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్స వాలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలకు సినీ ప్రముఖులు ఎవరూ రాకపోవడంపై ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్నపై కాంగ్రెస్ ఎమ్మెల్యే (కర్ణాటకలోని మాండ్య నియోజకవర్గం) రవి గనిగ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరయ్యేందుకు రష్మిక నిరాకరించినట్లు చెప్పారు.

తన కెరీర్‌ను ప్రారంభించిన పరిశ్రమను రష్మిక విస్మరించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కర్ణాటకలో కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో తన కెరీర్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే, గతేడాది అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి తాము ఆహ్వానం పంపితే నిరాకరించిందని మండిపడ్డారు. 'అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి రష్మికను ఆహ్వానించేందుకు మా ఎమ్మెల్యే స్నేహితుల్లో ఒకరు ఆమె ఇంటికి 10 నుంచి 12 సార్లు వెళ్లారు. కానీ ఆమె ఈవెంట్‌కు హాజరయ్యేందుకు నిరాకరించారు. నా ఇల్లు హైదరాబాద్‌లో ఉందని చెప్పారు. ఈవెంట్‌కు వచ్చేందుకు తనకు సమయం కూడా లేదని.. రాలేనని చెప్పారు. కన్నడ చిత్ర పరిశ్రమలో ఆమె కెరీర్ ప్రారంభించినప్పటికీ.. కన్నడ భాషను విస్మరించారు. అగౌరవపరిచారు. కన్నడను విస్మరించిన రష్మికకు మనం గుణపాఠం నేర్పించకూడదా?' అంటూ గనిగ వ్యాఖ్యానించారు.

**చలనచిత్ర రంగంపై చాలా కోపంగా ఉంది : డీకే శివకుమార్**

కాగా, శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవ వేదికపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. సినీ ప్రముఖులను ఆక్షేపించారు. తనకు చలనచిత్ర రంగంపై చాలా కోసంగా ఉందన్నారు. చలన చిత్ర రంగం కోసమే నిర్వహిస్తున్న బెంగళూరు చలన చిత్రోత్సవానికి పట్టుమని పది మంది నటులు కూడా పాల్గొనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అవసరముంటే వారికి ప్రభుత్వ సాయం చేయాలి. థియేటర్లు, చిత్ర నిర్మాణానికి రాయితీలివ్వాలి. మేము అవకాశం ఇవ్వకుంటే థియేటర్లు నడపలేరు. ఎవరి నట్లు, బోల్ట్‌లు ఎలా సరిచేయాలో నాకు తెలుసు' అంటూ డీకే వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విపక్షాలు, చలన చిత్ర రంగానికి చెందిన ప్రముఖులు విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన సంఘటనను ఎమ్మెల్యే తాజాగా గుర్తు చేసుకున్నారు. అనేకసార్లు ఈ చలనచిత్రోత్సవాలకు రష్మికను ఆహ్వానించినట్లు చెప్పారు. అయినప్పటికీ ఆమె నిరాకరిస్తూ వస్తున్నారన్నారు.రష్మిక కెరీర్ విషయానికి వస్తే.. రక్షిత్ శెట్టి నటించిన కిరిక్ పార్టీ అనే సినిమాతో కన్నడ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా సమయంలోనే రక్షిత్ శెట్టి, రష్మిక ప్రేమలో పడి ఎంగేజ్‌మెంట్ కూడా చేసుకున్నారు. అయితే అనుకొని కారణాల వలన ఈ జంట విడిపోయింది. ఆ తర్వాత టాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన రష్మిక ఛలో, గీతా గోవిందం, డియర్ కామ్రేడ్, సరిలేరు నీకేవ్వరు, భీష్మా, పుష్ప 1.2 చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది.

## క్రీడల గురించి రాజకీయ నాయకులు తక్కువ మాట్లాడాలి : కేసీ త్యాగి



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపై మాజీ స్పోర్ట్స్ జర్నలిస్టు, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షామా మహ్మద్ చేసిన బాడీ షేమింగ్ కామెంట్స్‌పై తీవ్ర దుమారం రేగుతోంది. రోహిత్ శర్మ ఫ్యాన్స్, క్రికెట్ ప్రేమికులు, బీజేపీ నాయకులు షామా వ్యా?్యలను తప్పుపడుతున్నారు. రోహిత్ శర్మ ప్రపంచ స్థాయి ఆటగాడని, ఆయన గురించి బాడీ షేమింగ్ చేయడం, క్రికెట్‌లో ఆయన సాధించిన ఘనతలను తక్కువ చేసి మాట్లాడటం సరైనదిగా కాదని అంటున్నారు.తాజాగా జేడీయూకు చెందిన సీనియర్ నాయకుడు కేసీ త్యాగి కూడా షామా మహ్మద్ కామెంట్స్‌పై స్పందించారు. రోహిత్ శర్మపై షామా మహ్మద్ కామెంట్స్ విషయాన్ని ఓ మీడియా సంస్థ కేసీ త్యాగి దగ్గర ప్రస్తావించగా ఆయన తన స్పందన తెలియజేశారు. కాంగ్రెస్ మహిళా అధికార ప్రతినిధి షామా మహ్మద్ ఆ వ్యాఖ్యలు చేసేముందు రోహిత్ శర్మ సాధించిన భారీ స్కోర్లను చూడాల్సిందని ఆయన వ్యాఖ్యానించారు. అయినా రాజకీయ నాయకులు క్రీడలకు సంబంధించిన విషయాల్లో జోక్యాన్ని తగ్గించుకోవాలని సూచించారు.

## అయోధ్యకు పాదరక్షల సమస్య.. పొక్లెయినర్లు, ట్రాలీలతో తరలిస్తోన్న అధికారులు!



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో జరిగిన మహాకుంభమేళా పుణ్యమా అని అయోధ్య సందర్శనకు భక్తులు పోటెత్తారు. నెలన్నర రోజుల నుంచి లక్షలాదిగా తరలిరావడంతో అయోధ్య మున్సిపాల్టీకి పాదరక్షణల సమస్య తలనొప్పిగా మారింది. గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన పాదరక్షలను తొలగించడానికి మున్సిల్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. లక్షల సంఖ్యలో భక్తులు వదలిపెట్టిన పాదరక్షలను పొక్లెయిన్లు, ట్రాలీలతో తరలిస్తున్నారు. ఇందుకు ఆలయంలోకి ప్రవేశ, నిష్క్రమణ నిబంధనలు మార్చడమే కారణం. ఆలయ ఎంట్రీ వద్ద ఉన్న మొదటి గేటు వద్ద భక్తుల పాదరక్షలను వదిలిపెడతారు.ఆలయం లోపల దాదాపు అర కిలోమీటరు మేర ఉన్న వృత్తాకార మార్గాల్లో తిరిగి, దర్శనం తర్వాత మళ్లీ అదే మార్గం నుంచి బయటకు వెళ్తుంటారు. కానీ, కుంభమేళా కారణంగా విపరీతమైన రద్దీ ఏర్పడటంతో దర్శనాలకు వచ్చినవారిని మూడో నెంబరు గేటు నుంచి బయటకు పంపుతున్నారు. మళ్లీ మొదటి గేటు దగ్గరకు వచ్చి చెప్పులు తీసుకోవాలంటే అయిదారు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. దీంతో వేలాది మంది తమ పాదరక్షలను తీసుకోవడానికి రకుండా వట్టికాళ్లతోనే వెళ్లిపోతున్నారు. దీంతో ఆ చెప్పులు కుప్పులుగా పోగవుతున్నాయి. వాటిని అక్కడ నుంచి తీసుకెళ్లేందుకు మున్సిపల్ సిబ్బంది పొక్లెయిన్లతో ట్రాలీల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 30 ట్రాలీల్లో పాదరక్షలను తరలించినట్లు అధికారులు తెలిపారు.శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా మాట్లాడుతూ.. 'గత 30 రోజుల నుంచి ఊహించని విధంగా భక్తులు రావడంతో ఎలాంటి గందరగోళం లేకుండా సులభం దర్శనం చేసుకునేలా ఏర్పాట్లలో మార్పులు చేశాం. ' అని ఆయన అన్నారు. ఇక, కుంభమేళా జరిగిన 45 రోజుల్లో మొత్తం 1.25 కోట్ల మంది భక్తులు అయోధ్య ఆలయాన్ని దర్శించుకున్నట్టు నివేదికలు చెబుతున్నారు. జనవరి 14న మకర సంక్రాంతి రోజున మొదలైన భక్తుల తాకిడి ఫిబ్రవరి 26 వరకు కొనసాగింది. మహాశివరాత్రి నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టారు. జనవరి 26 నుంచి రోజుకు సగటున 10 నుంచి 12 లక్షల మంది భక్తులు అయోధ్యను దర్శించుకున్నారు. గతేడాది జనవరి 22న అయోధ్య ఆలయం ప్రారంభమైన విషయం తెలిసిందే.

## పీఎం ధన్ ధాన్య కృషి యోజనతో ఇక ఆ ఇబ్బందులు తప్పినట్లే!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజనను వేగంగా అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. దేశంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చొరవ చూపుతోందని ఈ సందర్భంగా ప్రధాని వెల్లడించారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే తక్కువ దిగుబడులు వచ్చే ప్రాంతాలను గుర్తించి.. అక్కడి రైతులకు ప్రోత్సాహం అందించి.. వారిని కూడా అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఇందుకోసమే ఇటీవల ప్రవేశపెట్టిన 2025-2026 బడ్జెట్‌లో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజనను తీసుకువచ్చినట్లు వివరించారు. 2025-26 బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం గురించి.. దాన్ని తీసుకురావాల్సిన అవసరం గురించి వెల్లడించారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని.. అందుకే దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా మొదట ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని సంబంధిత అధికారులను ప్రధాని మోదీ ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటు చేసిన వెబినార్‌లో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా ప్రారంభించాలని ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని.. అయినప్పటికీ దేశ వినియోగంలో 20 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన రోజురోజుకూ పెరుగుతోందని.. అందుకు అనుగుణంగా ఆహార ధాన్యాలు, పాడి పరిశ్రమ, మత్స్య ఉత్పత్తులు కూడా మరింత పెరగాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.ఇక రైతులకు పెట్టుబడి సాయం కింద కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా దాదాపు రూ.3.75 లక్షల కోట్లు అకౌంట్లలో జమ చేసినట్లు ప్రధాని మోదీ గుర్తు చేశారు. 10 ఏళ్ల క్రితం వ్యవసాయ ఉత్పత్తి దాదాపు 265 మిలియన్ టన్నులు మాత్రమే ఉండేదని.. కానీ ప్రస్తుతం అది 330 మిలియన్ టన్నులకు పెరిగినట్లు చెప్పారు. ఉద్యానవన ఉత్పత్తి 350 మిలియన్ టన్నులను దాటిందని వెల్లడించారు. గత 10 ఏళ్లలో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో 2900కి పైగా కొత్త రకాల పంటలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అయితే కొత్త రకాలు రైతులకు అందుబాటులో ధరలో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

**ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన**

రైతులు మెరుగైన, నాణ్యమైన విత్తనాలను ఉపయోగించి.. భూసారం తగ్గకుండా చూసుకుంటూ.. అధిక ఉత్పత్తిని పండించే కొత్త మార్గాలను అన్వేషించడం.

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడితో వివిధ రకాల పంటలను పండించడానికి ప్రోత్సాహం. ఇది భూ సారం పెంచేందుకు కూడా ఉపయోగపడుతుంది.


రైతులు పండించిన పంటను నిల్వచేయడానికి గోడౌన్‌లను నిర్మించడం.

రైతుల పంట పొలాలకు నీటిని అందించడం వల్ల సాగు విస్తీర్ణం పెంచడం.

రైతులు తమ పంటలు పండించేందుకు కావాల్సిన పెట్టుబడి కోసం సులువుగా రుణాలు అందించడం.

దేశంలోని 100 జిల్లాల్లో సుమారు 1.7 కోట్ల మంది రైతులకు ఈ పథకం కింద ప్రయోజనం కలగనుంది.

## వాయమ్మో.. ప్రియుడితో కలిసి ఇల్లు కట్టుకునేందుకు..
## కన్నబిడ్డను ఆ మహిళ ఏం చేసిందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** రోజురోజుకూ మానవ సంబంధాలు పూర్తిగా మంట గలుస్తున్నాయి. పెళ్లిళ్లు అయ్యాక కూడా ఇతరులపై ప్రేమ, ఆకర్షణ పెంచుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కట్టుకున్న భర్త, కన్నవాళ్లు, పుట్టిన వాళ్లను సైతం కాటికి పంపుతూ.. అడ్డు తొలగించుకుం టున్నారు. అలాంటి పనికే సిద్ధమైందో మహిళ. ముఖ్యంగా తన ప్రియుడితో కలిసి ఓ ఇల్లు కట్టుకునేం దుకు.. కన్నబిడ్డనే కిడ్నాప్ చేసింది. ఆపై ఓ చోట దాచేసి మరీ గొంతు మార్చి ఇంటికి ఫోన్ చేసింది. 25 లక్షల ఇవ్వకపోతే మీ బిడ్డను చంపేస్తామంటూ బెదిరించింది. కానీ చివరకు పోలీసులకు చిక్కి ఊచలు లెక్కబెడుతోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.బిహార్‌లోని ఛప్రా జిల్లాకు చెందిన బబితా దేవికి అప్పటికే పెళ్లి అయింది. భర్తతో పాటు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భర్తే జీవితం, పిల్లలే సర్వస్వంగా బతుకుతున్న ఈమె జీవితంలో నితీష్ కుమార్ అనే వ్యక్తి వచ్చాడు. ఇక అప్పటి నుంచి భర్త, పిల్లలపై ప్రేమ మర్చిపోయి.. నితీష్ కుమార్ మత్తులో పడిపోయింది. అతడితోనే జీవితం సాగించాలని అనుకుంటోంది. అయితే ప్రేమికుడి వద్ద ఎక్కువగా డబ్బులు లేకపోవడంతో.. అతడితో వెళ్లిపోతే కష్టం అవుతుందని భావించింది. ఈక్రమంలోనే ఇద్దరూ మాట్లాడుకుని.. తాము కలిసి జీవించాలంటే ఓ ఇల్లు కావాలని నిర్ణయించుకున్నారు.ఎలాగైనా సరే తాము ఓ ఇంటిని నిర్మించుకోవాలని బబితా దేవి, నితీష్ కుమార్‌లు ప్లాన్ చేసుకున్నారు. అయితే అందుకు తమ వద్ద అంత పెద్ద మొత్తంలో డబ్బులు లేకపోవడంతో.. డబ్బుల కోసం ఆలోచనలు చేశారు. ఈక్రమంలోనే బబితకు తన భర్త ఉన్న డబ్బులు గుర్తొచ్చాయి. అయితే దొంగతనం చేస్తే తాను దొరికిపోతుందని భావించి.. తన కుమారుడిని కిడ్నాప్ చేస్తే భర్త కచ్చితంగా డబ్బులు ఇస్తాడని భావించింది. ఇదే విషయాన్ని ప్రియుడికి చెప్పగా అతడు కూడా ఓకే చెప్పాడు.దీంతో బబితా దేవి తన ప్రియుడు నితీష్ కుమార్ సాయంతో.. తన 13 ఏళ్ల కుమారుడు ఆదిత్య కుమార్‌ను కిడ్నాప్ చేసింది. ఆపై నితీష్ కుమార్ బాలుడిని తీసుకుని పాట్నా వెళ్లగా.. ఓ చోట బంధించారు. ఈక్రమంలోనే బబితా దేవి, నితీష్ కుమార్‌లు గొంతు మార్చుకుని మరీ ఆమె భర్తకు ఫోన్ చేశారు. మీ కుమారుడు ఆదిత్య కుమార్‌ను కిడ్నాప్ చేశామని చెప్పి.. 25 లక్షల రూపాయలు ఇస్తేనే అతడిని ప్రాణాలతో అప్పగిస్తామని అన్నారు. లేదంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో బబితా దేవి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు.ముఖ్యంగా ఆదిత్య కుమార్ తండ్రి, తల్లి బబితా దేవిని విచారించారు. ఈక్రమంలోనే బబితా దేవి తీరు అనుమానాస్పదంగా ఉండడంతో.. పోలీసులు తమదైన స్టైల్లో విచారించారు. ఈక్రమంలోనే ఆమె తానే కుమారుడిని కిడ్నాప్ చేయించానని చెప్పగా పోలీసులు షాక్ అయ్యారు. ముఖ్యంగా ప్రియుడు నితీష్ కుమార్, తాను కలిసి ఇల్లు కట్టుకోవాలని అనుకున్నామని.. అందుకు కావాల్సిన డబ్బు కోసమే కిడ్నాప్ చేశామంటూ వివరించింది. బాలుడు ఎక్కడున్నాడని ప్రశ్నించగా.. పాట్నాలో ఉన్నాడని చెప్పింది. ఆపై పోలీసులు అక్కడకు వెళ్లి బాలుడిని క్షేమంగా ఇంటికి తీసుకువచ్చారు. అలాగే నితీష్ కుమార్ ఇంటికి వెళ్లి అతడిని కూడా అరెస్ట్ చేశారు.

## కూతుళ్లు కూడా వారసులే.. చిరంజీవి వారసత్వం వ్యాఖ్యలపై కిరణ్ బేడీ స్పందన



**న్యూఢిల్లీ-నవభూమి:**వారసత్వంపై మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ వేడుకకు హాజరైన చిరు.. వారసత్వంపై మాట్లాడారు. తన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తనకు మనవడు కావాలని చిరంజీవి అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన నెట్టింట ట్రోల్స్ కూడా ఎదుర్కొన్నారు. తాజాగా చిరు వ్యాఖ్యలపై మాజీ ఐపీఎస్ కిరణ్ బేడీ స్పందించారు. కూతుళ్లు కూడా వారసులేనన్న విషయాన్ని నమ్మండి, గుర్తించండి అని ఆమె హితువు పలికారు.ఈ మేరకు కిరణ్ బేడీ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. 'చిరంజీవి గారూ.. కూతురు కూడా వారసురాలేనని నమ్మడం. ఎందులోనూ తక్కువ కాదని గ్రహించండి. ఇదంతా మీరు కూతురిని ఎలా పెంచుతారు, ఆమె ఎలా అభివృద్ధి చెందుతుంది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. అమ్మాయిలను పెంచిన తల్లిదండ్రుల నుంచి నేర్చుకోండి. వారిని బాగా చూసుకుంటే.. కుటుంబాలను గర్వపడేలా చేస్తారు. ఇప్పటికే చాలా మంది ఈ విషయాన్ని నిరూపించారు. అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదు' అని కిరణ్ బేడీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.కాగా, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం' గతనెల 14న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా మూవీ రిలీజ్‌కు రెండు రోజుల ముందు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ఈ వెంట్‌కు హాజరైన చిరు మాట్లాడారు. తన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తనకు మనవడు కావాలని చిరంజీవి అన్నారు. 'నేను ఇంట్లో ఉన్నప్పుడు, నా మనవరాళ్లు నా చుట్టూ ఉన్నట్లు అనిపించదు. నేను లేడీస్ హాస్టల్ వార్డెన్ లాగా, చుట్టూ ఆడవాళ్ళతో ఉన్నట్లు అనిపిస్తుంది. చరణ్ ఇప్పటికైన ఒక అబ్బాయిని కను. నా వారసత్వం కొనసాగాలంటే మనవడు కావాలి. కానీ చరణ్‌కి మళ్లీ ఆడపిల్ల పుడుతుందేమో అని నాకు భయంగా ఉంది' అంటూ చిరంజీవి చెప్పుకొచ్చారు.

## పోలీస్ రైడ్‌లో శిశువు మృతి.. ఇద్దరు పోలీసులపై కుటుంబం ఫిర్యాదు

**జైపూర్-నవభూమి:** పోలీసులు ఒక ఇంటిపై రైడ్ చేశారు. ఈ సందర్భంగా మంచంపై తల్లి పక్కన నిద్రిస్తున్న నెల వయస్సున్న శిశువును పోలీసులు కాలితో తొక్కినట్లు ఆ కుటుంబం ఆరోపించింది. దీంతో ఆ శిశువు మరణించినట్లు ఫిర్యాదు చేశారు. బిడ్డ మృతికి కారణమైన ఇద్దరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సైబర్ మోసం కేసులో నిందితుడ్ని అదుపులోకి తీసుకునేందుకు శనివారం నౌగావాన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఒక ఇంటికి పోలీసులు వెళ్లారు.కాగా, రైడ్ సందర్భంగా మంచంపై తల్లి పక్కన నిద్రిస్తున్న నెల వయస్సున్న పసి పాప అలిస్‌బాను పోలీసులు కాలితో తొక్కినట్లు ఆ కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో గాయపడిన చిన్నారి మరణించినట్లు ఫిర్యాదు చేశారు. తల్లి జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను ఇంటి నుంచి బయటకు నెట్టివేశారని ఆరోపించారు. ఇంట్లో తనిఖీ సమయంలో మహిళా పోలీసులు ఎవరూ లేరని ఫిర్యాదులో పేర్కొన్నారు.మరోవైపు పోలీసుల నిర్లక్ష్యం వల్ల నెల వయస్సున్న శిశువు మరణించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అల్వార్ ఎస్పీ నివాసం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిందితులైన ఇద్దరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు.

## కెమెరా చేతపట్టి లయన్ సఫారీకి వెళ్లిన ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యన్ సఫారీకి వెళ్లారు. నిత్యం అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే ప్రధాని.. తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యానికి వెళ్లారు. కెమెరా చేతపట్టి సింహాలను ఫొటోలు తీశారు.ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం తన సొంత రాష్ట్రం గుజరాత్ కు వెళ్లిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం అక్కడ సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సాసన్‌లోని రాష్ట్ర అటవీ శాఖ నిర్వహించే అటవీ అతిథి గృహం సిన్హ్ సదన్‌లో రాత్రి బస చేశారు. సోమవారం ఉదయం స్థానిక మంత్రులు, అటవీ శాఖ సీనియర్ అధికారులతో కలిసి సిన్హ్ సదన్ నుంచి సఫారీకి బయల్దేరారు. జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యంలో సింహ సఫారీకి వెళ్లారు.

## సినిమా చూసి ఆరేండ్ల బాలిక హత్య

**పాల్ఘర్-నవభూమి:**ఒక సినిమాలోని సీరియల్ కిల్లర్‌ను స్ఫూర్తిగా తీసుకుని 13 ఏండ్ల బాలుడు ఆరేండ్ల బాలికను హతమార్చాడు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్సోపరకు చెందిన ఈ బాలుడు అందరూ ముద్దు చేస్తున్నారన్న అసూయతో వరుసకు కజిన్ అయిన ఆరేండ్ల బాలికను గొంతు పిసికి హతమార్చాడు. మృతదేహాన్ని పోలీసులు కొండ ప్రాంతంలో కనుగొన్నారు.శనివారం ఆ బాలిక తప్పిపోయినట్టు గుర్తించిన బంధువులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, ఒక బాలుడు ఆమెను ఎక్కడికో తీసుకెళ్తున్న దృశ్యం కన్పించింది. ఆ బాలికను అతను గొంతునులిమి చంపాడు. అనంతరం రాయితో ఆమె ముఖాన్ని ఛిద్రం చేశాడు.'రామన్ రాఘవ్' చిత్రంలోని సీరియల్ కిల్లర్ పాత్రను స్ఫూర్తిగా తాను ఈ హత్య చేసినట్టు ఆ బాలుడు పోలీసులకు తెలిపాడు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెల్హార్ సీఐ జితేంద్ర చెప్పారు.

## ఔరంగజేబ్ గొప్ప పాలకుడు.. ఎస్పీ నేత వ్యాఖ్యలపై దుమారం

**ముంబై-నవభూమి:** సమాజ్‌వాదీ పార్టీ నేత అబు అజ్మీ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ మంచి పాలకుడని కితాబు ఇచ్చారు. ఆయన ఎంతమాత్రం క్రూరుడు కాదంటూ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో సహా పలు పార్టీల నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు 'దేశద్రోహం' కిందకు వస్తాయని, ఆయనపై లీగల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

సున్నితమైన అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం అబు అజ్మికి కొత్త కాదు. తాజాగా ఆయన ఔరంగజేబ్‌ను కనికరం లేని నేత అనడం సరికాదని, ఆయన మంచి పాలకుడని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ఒకప్పటి పాలకులు అధికారం కోసం, ఆస్తుల కోసం పోరాడేవారు. మతం కోసం కాదు. ఆయన (ఔరంగజేబ్) 52 ఏళ్లు పాలన సాగించారు. ఆయనే కనుక హిందువులను ముస్లింలుగా మార్చి ఉంటే ఎంతమంది హిందువులు ఎంతమంది ముస్లింలుగా మారేవారో ఊహించుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు. ఔరంగజేబ్ ఆలయాలను ధ్వంసం చేసి ఉంటే, ఆయన మసీదులను కూడా ధ్వంసం చేసేవారనీ, ఆయనే కనుక హిందూ వ్యతిరేకి అయితే 34 శాతం హిందువులు ఆయనతో ఉండేవారుకాదని, ఆయన సలహాదారుల్లో కూడా హిందువులకు చోటు ఉండేది కాదని వివరించారు. దీనిని హిందూ-ముస్లిం కోణంలో చూడాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశం రాజ్యాంగం ఆధారంగా నడుస్తున్న దేశమైనందున ఇంతకంటే తాను ఎక్కువ మాట్లాడలేదని చెప్పారు.

ఔరంగజేబ్‌ను ప్రశంసిస్తూ అబు అజ్మి చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

12 | హైదరాబాద్ | మంగళవారం | 4 । మార్చి । 2025


## ఆస్కార్ వేదికపై హిందీ..సర్ ప్రైజ్ అయిన భారతీయులు!



ఇప్పటికే ఆస్కార్ అవార్డులు, పాన్ ఇండియా సినిమాలతో భారతీయ చిత్ర పరిశ్రమ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కించుకుంది. భారతీయ సినిమాలకంటూ ప్రపంచ వేదికలపై ప్రత్యేకమైన స్థానం ఏర్పడుతుంది. భారతీయ నటులుకు ప్రపంచ భాషల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. హాలీవుడ్ మేకర్స్ రామ్ చరణ్, ఎన్టీఆర్ లాంటి వాళ్లను పిలిచి మరీ ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది భారత్ తరుపున ఆస్కార్ కోసం డ్రాగన్ బాక్సాఫీస్.. తెలుగులో కూడా తిరుగేలేదు! కానీ ఈ రేసులో అనూజ ఓటమి పాలైంది.'అనూజ'ను ఓడించి లైవ్ యాక్షన్ ఫిల్మ్ కోటాలో ఐయామ్ నాట్ ఏ రోబో అవార్డును గెలుచుకుంది. అలా భారత్ చిత్రం ఆస్కార్ తుది పోరులు తల వచ్చింది. రేసులో గెలుపోటములు సహజం. అయితే ఆస్కార్ వేడుకలో హిందీ భాష హైలైట్ అయింది. ఈ వేడుకను కానన్ ఓ బ్రెయిన్ హోస్ట్ చేసారు. ఈ సందర్భంగా ఆస్కార్ వేడుకపై హిందీలో మాట్లాడారు. భారత ప్రజలకు శుభోదయం అంటూ పలకరించారు. ఈ వేడుక జరిగే సమయం మీకు ఉదయం కదా? అందరూ టిఫిన్ చేసారా? అంటూ ఆకట్టుకున్నారు. దీనికి భారతీయులంతా ఎంతో సంతోష పడ్డారు. నెట్టింట నెటి జనులు ఫిదా అవుతున్నారు. భారతీయులంతా దీన్ని ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నారు. అనూజకు అవార్డు వస్తే బాగుందని చాలా మంది భారతీయులు ఆశపడ్డారు. ఆ రకమైన పోస్టులతో అనూజను నెట్టింట హైలైట్ చేసారు. కానన్ బ్రెయిన్ హోస్ట్‌గా వ్యవరించడం ఇదే తొలిసారి. అయినా? భారతయుల పట్ల ఆయన వ్యవరించిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు.

# నవచిత్ర



## ప్రియాంక చోప్రా నెక్ట్స్ ఏంటి?



గ్లోబల్ ఐకన్ ప్రియాంక చోప్రా (పీసీ) బాలీవుడ్ నుంచి హాలీవుడ్ లో ప్రవేశించి అక్కడా తన స్థాయిని నిరూపించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సిటాడెల్ – 2 సిరీస్ లో నటిస్తున్న పీసీ తిరిగి భారతీయ సినీపరిశ్రమలో రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే పీసీ ఒక సౌత్ సినిమాతో ఘనమైన పునరారంగేట్రాన్ని చాటుకోనుంది. దీనికోసం ప్రస్తుతం మకాం ముంబై నుంచి హైదరాబాద్‌కి మార్చింది. సూపర్ స్టార్ హహేష్ – రాజమౌళి కాంబినేషన్‌లోని ఎస్ఎస్ఎంబిలో ఒక కథానాయికగా నటిస్తోంది. ఇటీవల షూటింగ్‌లో ప్రియాంక చోప్రా ఫుల్ బిజీగా ఉంది. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో ప్రస్తుతం చిత్రీకరణ సాగుతోందని సమాచారం. ఈ చిత్రం కోసం మహేష్ చాలా శ్రమిస్తున్నారు. తన తొలి తెలుగు చిత్రం కోసం పీసీ చాలా హార్డ్ వర్క్ చేస్తోంది. మరోవైపు ప్రియాంక చోప్రా మరిన్ని భారీ ప్రాజెక్టులపై సంతకాలు చేస్తోంది. ఫర్హాన్ అక్తర్ జీలే జరాలో కూడా నటించాల్సి ఉంటుంది. అయితే ఇది చాలా ఆలస్యమైంది. దీనిని ఫర్హాన్ అక్తర్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే హాలీవుడ్ చిత్రం హెడ్స్ ఆఫ్ స్టేట్‌కి సంతకం చేసిందని కథనాలొచ్చాయి. మహేష్ బాబుతో ఎస్ఎస్ఎంబి29 చిత్రీకరణ 2025- 2026 అంతటా కొనసాగుతుంది. ఈ సినిమాని 2 భాగాలుగా రాజమౌళి ప్లాన్ చేస్తున్నారని 1000 కోట్లు ఖర్చు చేస్తారని కథనాలొస్తున్నాయి.

## అబ్బాయ్ కోసం బాబాయ్ పవన్ ప్రయత్నాలా?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఆర్సీ 16 షూటింగ్ బుచ్చిబాబు దర్శకత్వంలో శర వేగంగా జరుగు తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్ షెడ్యూల్ ముగించుకుని ఢిల్లీ షెడ్యూల్ కు రెడీ అవు తోంది. రామ్ చరణ్ సహా ప్రధాన పాత్ర ధారులపై కీలక సన్నివేశాలు అక్కడ చిత్రీకరించనున్నారు. అయితే ఢిల్లీ లో షూటింగ్ ప్లాన్ చేయడంతో కుస్తీ పోటీకి సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరిస్తారని ప్రచారం జరిగింది. కానీ అసలు విషయం అది కాదని తెలుస్తోంది. పార్లమెంట్ లో కొన్ని సన్నివేశాలు షూట్ చేయాల్సి ఉందిట. దీనిలో భాగంగానే ఢిల్లీ వె ళ్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే పార్లమెంట్ లో షూటింగ్ అనుమతులు అంత వీజీ కాదు. గతంలో షూటింగ్ సినిమా షూటింగ్ అనే సరికి పెద్దగా ప్రొసిజర్ లేకుండా అనుమతులు ఈజీగా వచ్చేవి. ఇప్పుడు అలా రావడం లేదు. చాలా సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ఆర్సీ 16 టీమ్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హోదాతో సులువుగా అనుమతులు సంపాదించే పనిలో పడ్డట్లు సమాచారం. కూటమి పేరుతో ఢిల్లీలో చక్రం తిప్పగల నాయకుడిగా ఎదిగిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రభుత్వ పెద్దలతో మంచి పరిచయాలు, సాన్నిహిత్యం ఉంది. కాబట్టి అబ్బాయ్ సినిమా షూటింగ్ కోసం అనుమతులు పవన్ తలుచుకుంటే చాలు పనైపోతుంది. అలాగే జామా మసీదులో కూడా కొన్ని సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉందిట. దీనికి సంబంధించి రంజాన్ తర్వాత అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ఈ లోగా పార్లమెంట్ లో అనుమతులు వస్తే ముందుగా అక్కడ షూట్ పూర్తి చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే క్యాన్సర్ చికిత్స నుంచి శివ రాజ్ కుమార్ కోలుకుంటున్నారు. ఈవారంలో ఆయన కూడా షూట్ లో జాయిన్ అవుతారని సమాచారం. ఇప్పటికే శివ రాజ్ కుమార్ పై కొంత షూటింగ్ పూర్తయింది. మరికొన్ని రోజులు పాల్గొంటే ఆయన పోర్షన్ పూర్తవుతుందని సమాచారం.

## మెగాస్టార్ బర్త్ డేకి దిగిపోతారా?



మెగాస్టార్ చిరంజీవి కథానాయ కుడిగా నటిస్తోన్న 'విశ్వంభర' సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలనుకున్న సంగతి తెలిసిందే. కానీ తనయుడు రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' కూడా రిలీజ్ కి ఉండటంతో 'విశ్వంభర' వాయిదా వేసుకున్నారు. దీంతో పనులు కూడా నెమ్మదించాయి. వాయిదా పడిన నాటి నుంచి పనులన్నీ మందగించాయి. అన్ని నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ ఓ రెండు పాటలు మినహా షూట్ అంతా పూర్తయింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా 'విశ్వంభర' రిలీజ్ ఎప్పుడు? ఉంటుంది అన్న దానిపై ఆసక్తి నెలకొంది. మార్చి లేదా వేసవి సెలవులు సందర్భంగా రిలీజ్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. కానీ సినిమా వేసవిలో రిలీజ్ కాదని తెలుస్తోంది. చిత్రాన్ని ఆగస్టుకి వాయిదా వేసినట్లు సమాచారం. ఆగస్టులో కూడా మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఆ రోజున రిలీజ్ చేస్తే మెగా అభిమానులకు కూడా ఓ ట్రీట్ లా ఉంటుందని చిరంజీవి అండ్ కో ఇలా ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో చిరంజీవి నటించిన చాలా సినిమాలు ఆయన పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ అయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో 'విశ్వంభర' విషయంలో అదే సెంటి మెంట్ ఫాలో అవ్వడానికి డిసైడ్ అయినట్లు వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి. చిరంజీవి బర్త్ డే అంటే ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున సెలబ్రేషన్లు ఉంటాయి. పలుచోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి భారీ ఎత్తున రక్త సేకరణ జరుగుతుంది. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం ఉంటుంది. అందుకు ప్రతిగా చిరంజీవి కూడా అభిమానులకు తనవంతుగా ఏదో ఒక స్పెషల్ ట్రీట్ ఇస్తుంటారు. ఈసారి ఆ ట్రీట్ విశ్వంభర రిలీజ్ అవ్వాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## దేవర-2 పైనే అసలు డౌట్..
### మళ్ళీ రణ్వీర్ అంటారేంటి?



బిజినెస్ గల సినిమాలు లైనప్ చేసుకుంటున్న ఎన్టీఆర్‌కి 'దేవర 2' కూడా అదే స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉంటుంది. ఇదిలా ఉండగా కొరటాల శివ మాత్రం 'దేవర 2' స్క్రిప్ట్‌పై మళ్లీ మళ్లీ పని చేస్తున్నట్లు సమాచారం. మొదటి పార్ట్‌కు వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా స్క్రిప్ట్‌లో మార్పులు చేయాలని చూస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. అలాగే ఈసారి మళ్ళీ బాలీవుడ్ మార్కెట్‌ను ఫోకస్ చేయాలని డిసైడ్ అయిన కొరటాల, హిందీ ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేసేలా కథను ప్లాన్ చేస్తున్నాడట. దీనిలో భాగంగా హిందీ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ కోసం ఓ ప్రత్యేకమైన పాత్రను డిజైన్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే విలన్ పాత్రలో ఫస్ట్ పార్ట్ లో సైఫ్ అలీ ఖాన్ నటించిన విషయం తెలిసిందే. ఇక న్యూ రోల్ కోసం త్వరలోనే రణ్వీర్‌తో చర్చలు జరపనున్నారని కూడా టాక్ ఉంది. అయితే అసలు 'దేవర 2' ఉంటుందా లేదా అన్న అనుమానాల మధ్య రణ్వీర్ సింగ్ పాత్ర ఉంటుందని అంటుండడం నమ్మడానికి కొద్దిగా కష్టంగా ఉంది. ఎన్టీఆర్ క్రేజ్ నార్త్‌లో పెరుగుతుండటంతో బాలీవుడ్ నుంచి బడా హీరోలు ఈ సినిమాలో ఉంటే మరింత ప్లస్ అవుతుందని కొరటాల ఆలోచించి ఉండొచ్చు. ఇక మరోవైపు 'దేవర 2'కి సంబంధించి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇంకా రాలేదు. కొరటాల శివ మాత్రం ఎన్టీఆర్‌తో 'దేవర 2' ఉంటుందని ఆ మధ్యం బలంగా చెప్పుకుంటున్నారు. కానీ తారక్ లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్ లో కూడా ఆ నమ్మకం కలగడం లేదు. ఏదేమైనా పూర్తిగా ఎన్టీఆర్ చేతుల్లోనే ఉంది. కొరటాల స్క్రిప్ట్ ను అంతకుమించి అనేలా సెట్ చేస్తే తప్ప సెట్స్ పైకి రాకపోవచ్చు. ఇప్పుడు 'వార్ 2' – 'ప్రశాంత్ నీల్ మూవీ' పూర్తయిన తర్వాతే ఎన్టీఆర్ ఈ సినిమా విషయంలో స్పష్టత ఇవ్వొచ్చు. కానీ ఇప్పటివరకు 'దేవర 2' విషయంలో సస్పెన్స్ గాసిప్స్ తప్పవు.

'దేవర' మొదటి భాగం మంచి వసూళ్లు సాధించినప్పటికీ సినిమా అవుట్‌పుట్ పట్ల ఎన్టీఆర్ పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదనే టాక్ అప్పట్లోనే వినిపించింది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ విషయంలో ప్రధానంగా ఎన్టీఆర్ పెర్ఫార్మెన్స్, అనిరుధ్ సంగీతం మాత్రమే ప్లస్ పాయింట్స్ అయ్యాయి. ముఖ్యంగా అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని సీన్లను మరో లెవల్‌కి తీసుకెళ్లిందన్న అభిప్రాయమే ఎక్కువగా వచ్చింది. ఇక కొరటాల శివ మేకింగ్‌పై, కథా సరళిపై మిశ్రమ స్పందన రావడంతో 'దేవర 2' ఉంటుందా లేదా అనే అనుమానాలు అప్పట్నుంచే నెలకొన్నాయి.కానీ కొరటాల ఈ ప్రాజెక్టుపై ఇంకా పని చేస్తున్నట్లు టాక్ వస్తోంది. ఇక ఎన్టీఆర్ ప్రస్తుతం హిందీ బిగ్ బడ్జెట్ మూవీ 'వార్ 2' చివరి షెడ్యూల్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా పక్కా 1000 కోట్ల మార్కెట్ కలిగిన బొమ్మగా చెప్పుకుంటున్నారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర ఇంటెన్స్‌గా ఉండబోతుందని ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చేసింది. మరి ఈ మూవీ బ్లాక్‌బస్టర్ అయితే ఆ కలెక్షన్స్ డబుల్ అవ్వొచ్చు. వేశ్య కథ ఉత్తమ ఆస్కార్ చిత్రంగా ఆ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమా కూడా భారీ లెవెల్ ప్రాజెక్ట్ అవ్వబోతుంది. ఇది హై వోల్టేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండబోతుందని టాక్. ఇలా వరుసగా 1000 కోట్ల

## వరుణ విజయం



**దుబాయ్–నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీలో భారత్ దుమ్మురేపింది. బంగ్లాదేశ్‌తో మొదలైన టీమ్ఇండియా గెలుపు జోరు పాకిస్థాన్, న్యూజిలాండ్‌పైనా కొనసాగింది. ఆదివారం జరిగిన గ్రూపు–'ఏ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ఇండియా 44 పరుగుల తేడాతో కివీస్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా చాంపియన్స్ ట్రోఫీలో కివీస్‌పై తొలి గెలుపు నమోదు చేసుకుంది. భారత్ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్ 45.3 ఓవర్లలో 205 పరుగులకు కుప్పకూలింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(5/42) ధాటికి కివీస్ విలవిలలాడింది. కేన్ విలియమ్సన్(81) మినహా మిగతా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. కుల్దీప్‌యాదవ్ (2/56)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత శ్రేయాస్ అయ్యర్ (98 బంతుల్లో 79, 4ఫోర్లు, 2సిక్స్‌లు) బాధ్యతాయుత అర్ధసెంచరీకి తోడు అక్షర్‌పటేల్(42), హార్దిక్‌పాండ్యా(45) రాణించడంతో టీమ్ఇండియా 50 ఓవర్లలో 249/9 స్కోరు చేసింది. మ్యాట్ హెన్రీ(5/42) ఐదు వికెట్లతో విజృంభించాడు. ఐదు వికెట్లతో కివీస్ పతనాన్ని శాసించిన వరుణ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. వన్డేల్లో వరుణ్‌కు ఇది అత్యుత్తమ ప్రదర్శనగా నమోదైంది.

## రోహిత్ శర్మది ఆకట్టుకునే ఆకారం కాదు..



**ముంబై–నవభూమి:** రోహిత్ శర్మది ఆకట్టుకునే ఆకారం కాదు.. టీమిండియా కెప్టెన్‌పై కాంగ్రెస్ మహిళా నేత కామెంట్స్

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేత, మాజీ స్పోర్ట్స్ జర్నలిస్ట్ షామా మొహమ్మద్ బాడీ షేమింగ్ కామెంట్స్ చేశారు. రోహిత్ శర్మ చాలా లావుగా ఉంటాడని, ఆయన బరువు తగ్గాల్సిన అవసరం ఉందని తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అంతేగాక రోహిత్ ఏదో లక్కీగా కెప్టెన్ అయ్యాడని, సచిన్, ద్రవిడ్, గంగూలీ, కోహ్లీ, ధోనీలతో పోల్చితే ఆయన జస్ట్ యావరేజ్ ఆటగాడని వ్యాఖ్యానించారు.ఇప్పటివరకు టీమిండియా కెప్టెన్‌లుగా బాధ్యతలు నిర్వహించిన వారిలో అంతగా ఆకట్టుకోలేని కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రమేనని షామా కామెంట్ చేశారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ 17 బంతుల్లో 15 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకురాలు తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఈ కామెంట్స్ చేశారు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో గెలిచింది. అయినా షామా మహ్మద్ రోహిత్ శర్మపై బాడీ షేమింగ్ కామెంట్స్ చేయడం సంచలనం రేపింది.

# నవక్రీడ

## ప్రత్యర్థి జట్లకు ప్రయాణ తిప్పలు!




**కరాచీ–నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీలో భారత ప్రత్యర్థి జట్లకు ప్రయాణ తిప్పలు తప్పడం లేదు. భద్రతా కారణాల రీత్యా తాము పాకిస్థాన్‌లో పర్యటించలేమన్న టీమ్ఇండియా తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడుతుండగా, మిగతా జట్లు పాక్‌లో వివిధ వేదికల్లో ఆడుతున్నాయి. టీమ్ఇండియాతో సెమీస్‌లో తలపడేందుకు ఇప్పటికు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు దుబాయ్‌కు బయల్దేరినట్లు తెలిసింది. మంగళవారం తొలి సెమీస్ ఉన్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో సిద్ధమయ్యేందుకు ముందుగానే చేరుకోనున్నాయి.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**